RNI : APTEL/25/A0108

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 331, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 5, /- సోమవారం - 09 - మార్చి - 2026

published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898




## మహిళా సాధికారతే లక్ష్యం

## మహిళా దినోత్సవం వేళ

## సీఎం చంద్రబాబు సందేశం

- తెలుగింటి ఆడపడుచులకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు
- మహిళా సాధికారతే లక్ష్యంగా తల్లికి వందనం, ఉచిత బస్సు, దీపం-2 పథకాల అమలు
- మెగా డీఎస్సీ ద్వారా 7955 మంది, పోలీసు శాఖలో 993 మంది మహిళలకు ఉద్యోగాలు
- 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే సర్కార్ లక్ష్యం
- మహిళల ఆరోగ్య రక్షణ కోసం ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ పంపిణీ

## మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్...

# నేనే అంబాసిడర్‌గా ఉంటా

### 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- అమరావతిలో కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రకటన
- డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ



అమరావతి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సభకు భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముగ్గురం కలిసి మహిళల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సృష్టికి మూలం మహిళ అని, మిగతా.. 2లో

## ఆ 160 మంది బాలికల మృతికి

# ఇరాన్ ఆయుధాలే కారణం

- ఇరాన్ పాఠశాలపై జరిగిన దాడిని ఖండించిన అమెరికా అధ్యక్షుడు
- ప్రమాదానికి ఇరాన్ నాణ్యత లేని ఆయుధాలే కారణమని విశ్లేషణ
- యుద్ధంలో సంపూర్ణ విజయం సాధిస్తున్నామని ట్రంప్ ప్రకటన
- ఇరాన్ క్షిపణి వ్యవస్థ, నౌకాదళం ధ్వంసమైనట్లు వెల్లడి
- చర్చలకు సిద్ధమే కానీ ఇరాన్ వైఖరి మారాలన్న అమెరికా ఎన్వాయ్



ఢిల్లీ: ఇరాన్‌లోని ఓ ప్రాథమిక పాఠశాలపై జరిగిన ఘోర బాంబు దాడిలో 160 మంది మరణించిన ఘటనపై అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, ఈ దాడితో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. ఆయన ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో మయామికి మిగతా.. 2లో

## తమిళనాడులో పొత్తుల రాజకీయం..


# విజయ్ పార్టీకి ఎన్డీయే ఆహ్వానం




- ఎన్డీయే కూటమిలోకి విజయ్ పార్టీ రావాలని బీజేపీ పిలుపు
- డీఎంకే వ్యతిరేక ఓట్లు చీలకుండా కలిసి రావాలని సూచన
- స్టాలిన్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందన్న బీజేపీ

## గల్ఫ్ దేశాలపై ఇరాన్ భీకర దాడులు...

# కువైట్, సౌదీలలో ఉద్రిక్తత




- కువైట్ ఎయిర్‌పోర్ట్ ఇంధన ట్యాంకులే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్ దాడులు
- సౌదీలోని రియాద్, ఎయిర్ బేస్‌లపైకి దూసుకొచ్చిన క్షిపణులు
- యుద్ధం మొదలైనప్పటి నుంచి 1300కు పైగా డ్రోన్లను ప్రయోగించిన ఇరాన్

## బెంగాల్ యువతకు దీదీ బంపర్ ఆఫర్ 10వ తరగతి పాస్

# అయితే చాలు.. నెలకు రూ.1,500 భృతి!




- పశ్చిమ బెంగాల్‌లో 'యువశక్తి' పథకాన్ని ప్రకటించిన మమతా బెనర్జీ
- 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా టీఎంసీ వ్యూహం




## ఆకాశంలో సగం కాదు...

# నింగీ నేలా మీరే

### మహిళలకు నారా లోకేశ్ శుభాకాంక్షలు

- మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్
- ఎన్టీఆర్ ఆస్తిహక్కు కల్పిస్తే చంద్రబాబు పొదుపు సంఘాలు తెచ్చారని వెల్లడి
- పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చాగంటి కోటేశ్వరరావు నియామకం
- ఆడపిల్లలా ఏడవొద్దు.. గాజులు తొడుక్కోలేదు వంటి మాటలు మాట్లాడటం తప్పే
- సినిమాల్లో మహిళలను కించపరిచేలా ఉంటే ఊరుకోనని హెచ్చరిక

## ఏ ఇంట్లో పుట్టినా మహిళలపై

# వివక్ష జరుగుతుంది...

### తండ్రి, అన్న అంతా మహిళలను తక్కువ చేసేవారే




### కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: ఇప్పటికీ మహిళలు వివక్ష ఎదుర్కొంటూనే ఉన్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఏ ఇంట్లో పుట్టినా మహిళలపై వివక్ష జరుగుతుంది...భర్త, తండ్రి, అన్న అంతా మహిళలను తక్కువ చేసేవారే అని అన్నారు. మగవాళ్లు ఉంటేనే మహిళలు ముందుకు వెళ్తారనడం దారుణమన్నారు.వయసుతో సంబంధం లేకుండా మహిళలంతా రాజకీయాల్లోకి రావాలి అని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. ఏ ఇంట్లో పుట్టినా మహిళలపై వివక్ష జరుగుతుంది తండ్రి అన్న అంతా మహిళలను తక్కువ చేసేవారే కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు 'మహిళ దినోత్సవం రోజే కాదు.. ప్రతి రోజు మహిళలను గౌరవించేలా పరిస్థితులు మారాలి. ప్రొ.జయశంకర్, మాజీ సీఎం కేసీఆర్ లాంటి వాళ్లు ఈ నేలపై నడిచారంటే అందుకు వాళ్ల తల్లులే కారణం'అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.




## చిరంజీవి తదితరులకు అభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

- ఎన్టీఆర్ జాతీయ సినీ పురస్కారానికి మెగాస్టార్ చిరంజీవి ఎంపిక
- పైడి జయరాజ్ అవార్డుకు ఎంపికైన లోకనాయకుడు కమల్ హాసన్
- అక్కినేని నాగేశ్వరరావు ఫిల్మ్ అవార్డుకు నటి జయసుధ ఎంపిక
- దర్శకుడు సింగీతం, నిర్మాత అశ్వినీదత్‌లకు దక్కిన పురస్కారాలు

## కొత్త హంగులతో తెలంగాణ శాసన మండలి భవనం ప్రారంభం

- తెలంగాణ శాసన మండలి నూతన భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- అసెంబ్లీ ప్రాంగణంలోని పాత అసెంబ్లీ బిల్డింగ్‌లో ఇకపై మండలి సమావేశాలు
- రూ.30 కోట్లతో పాత భవనాన్ని ఆధునీకరించిన ప్రభుత్వం
- ఈసారి బడ్జెట్ సమావేశాలు ఈ కొత్త భవనంలోనే నిర్వహణ



హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ప్రాంగణంలోని చారిత్రక పాత అసెంబ్లీ భవనం ఇకపై శాసన మండలి (లెజిస్లేటివ్ కౌన్సిల్)గా సేవలు అందించనుంది. అత్యాధునిక హంగులతో ఆధునీకరించిన ఈ భవనాన్ని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మిగతా.. 2లో

## రాష్ట్రపతి పదవికి

# అత్యున్నత గౌరవం దక్కాలి...

- ద్రౌపది ముర్ము ఆవేదన ఆందోళన కలిగించింది
- భారత రాష్ట్రపతి పదవి అనేది దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవి
- రాష్ట్రపతి పర్యటన అంటే ఎంతో హుందాగా, పకడ్బందీగా జరగాలి
- రాష్ట్రపతి పర్యటనలో ప్రొటోకాల్, మర్యాదలకు భంగం వాటిల్లడం సరికాదు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి: భారత రాష్ట్రపతి పదవి అనేది దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవి అని, ఆ పదవికి, ఆ వ్యవస్థకు ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవం దక్కాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. రాష్ట్రపతి పర్యటన అంటే ఎంతో హుందాగా, పకడ్బందీగా జరగాలని,




మిగతా.. 2లో

## త్వరలోనే తెలంగాణలో

# ఉచిత స్కూటీలు

### విద్యార్థినులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీల పంపిణీ

- 2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులు
- నగరంలోని డీజిల్ బస్సులు జిల్లాలకు తరలింపు
- ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై జీరో ట్యాక్స్ విధానం
- ప్రజాభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని విద్యార్థినులకు తీపి కబురు అందించారు. చదువుకునే ఆడబిడ్డల ప్రయాణ కష్టాలను మిగతా.. 2లో

## మానవ సమాజ వికాసానికి స్త్రీల పాత్ర ప్రముఖమైనది

### విజయనగరం జిల్లా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కులాల ఐక్యవేదిక నాయకులు



విజయనగరం, మహిన్యూస్, మార్చి 08: సంఘసంస్కర్త, మానవతావాది, గురజాడ అప్పారావు స్మారక నివాసంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు



బూరా ఐశ్వర్య యాదవ్, పి మీనాక్షి, చోడి ఆదినారాయణ, రోంగల రామారావు, లాయర్ కరీం, మాట్లాడుతూ ఏ సమాజంలో అయితే స్త్రీలు గౌరవింపబడతారో ఆ సమాజం అభివృద్ధిలో ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో స్త్రీలు పట్ల వివక్షత, అత్యాచారాలు, పెరిగిపోయి స్త్రీలు అవమానం పాలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆకాశంలో సగం, అందరిలో సగం, ఉన్న స్త్రీలకు సమాన అవకాశాలు దొరకడం లేదని ఆవేదన వెలబుచ్చారు. ప్రతి ఇంట్లోనూ, సమాజంలోనూ, స్త్రీలను అణచివేయడం వలన స్త్రీ వికాసము, అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. స్త్రీలపై వివక్షత, అణిచివేత పోవాలంటే చట్టాల ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని తెలిపారు. చట్టసభల్లో జనాభా శాతం బట్టి స్త్రీలకు రాజకీయ,విద్యా, ఉద్యోగాలు, ఉపాధి, అవకాశాలు ప్రభుత్వాలు కల్పిస్తే స్త్రీలకు సమాన వాటా దక్కి సమాజంలో గౌరవప్రదమైన జీవితం లభిస్తుందని తద్వారా సమాజం ముందు వరసలో ఉంటుందని మానవ విలువలు నిలబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇప్పిలి రామారావు,దిమిలి పైడ్రాజు, టీవీ దుర్గారావు, గంద్రేటి శ్రీను, పి షణ్ముఖరావు, చెలికి లక్షణరావు, కుందేటి పార్వతి, ఎస్ ఆదిలక్ష్మి,నూర్ జాసన్ బిసి,జె. జానీ, టి సత్యనారాయణ, మొదలగు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం





రాజోలు, మహిన్యూస్, మార్చి 08: రాజోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం హట్టహాసంగా జరిగింది.తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అధికసంఖ్యలో ఈ



కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి శ్రేణులు కేతా శ్రీనివాస్ ఇంటి వద్దకు వచ్చి అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి వాడ్రేవుపల్లి గటిగంటి వాసు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కేతా వెంకటలక్ష్మి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గా ఆమెతో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో శెట్టి బలిజ కులస్తులు భారీ సంఖ్యలో పాల్గొని వారి మద్దతును చైర్మన్ కి తెలియజేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం కూటమి నాయకులకు, కార్యకర్తలకు విందు ఏర్పాటు చేశారు.

## జనసేనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

### జనసేన నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు.

నెల్లూరు.: జనసేన పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు కోరారు. ఆదివారం 3వ డివిజన్‌లో జనసేన డివిజన్ ఇన్‌చార్జి బత్తల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ రాజీవ్ గాంధీ కాలనీలో నివసిస్తున్న 30 మంది హిజ్రాలు జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాంత్ సుజయ్‌బాబు కి తెలియచేయగా 3వ డివిజన్ రాజీవ్ గాంధీ కాలనీలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారిచేత ఉద్యమి సభ్యత్వ నమోదు స్వీకరించారు. హిజ్రా నాయకురాలు సునంద ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరిన అనంతరం మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పరిపాలనా విధానాలు నచ్చి పార్టీలో చేరామన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి పార్టీలో చేరడానికి ముందుకు వచ్చామన్నారు. ఈ సందర్భంగా సుజయ్‌బాబు మాట్లాడుతూ జనసేన అధినేత,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులలై 30 మంది హిజ్రాలు జనసేన పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉధృతంగా జరుగుతుందన్నారు. నెల్లూరు జిల్లా సభ్యత్వం 2024లో 35 వేలకు చేరుకుందని, ఈ సంవత్సరం 50 వేల సభ్యత్వాలు టార్గెట్‌గా కృషి చేస్తున్నామన్నారు. జనసేన పార్టీకి ప్రజల్లో విశేషమైన స్పందన ఉందని, పవన్ కళ్యాణ్ నాయకత్వం మీద .. ఆయన చేస్తున్న పనితీరును ప్రజలు ఎంతో అభినందిస్తున్నారని, చాలా మంది సభ్యత్వ నమోదులో పాల్గొంటున్నారని, ఈ సారి మహిళలు కూడా అధిక సంఖ్యలో సభ్యత్వాన్ని తీసుకుంటున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, నగర ప్రధాన కార్యదర్శి శనివరపు అజయ్‌బాబు, స్థానిక జనసేన కార్యకర్తలు శ్రీను, లోకేష్, ప్రదీప్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిలభారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులుగా జానపాటి రామసుబ్బయ్య



నెల్లూరు.: అఖిలభారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులుగా జానపాటి రామసుబ్బయ్య నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడ నగరంలోని స్థానిక బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం- కళ్యాణ మండపం నందు ఆదివారం అఖిలభారత పద్మశాలి సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు సంబంధించి నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో భాగంగానే అఖిల భారత పద్మశాలి సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులుగా జానపాటి రామసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీ.వీ. నాగేశ్వర రావు ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన జానపాటి రామసుబ్బయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన పదవీ బాధ్యతలను నెరవేరుస్తూ, సంఘ అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య,రాష్ట్ర సహాయ కార్యదర్శి చింత గింజల సుబ్రహ్మణ్యం, జాతీయ చేనేత అధ్యక్షులు ధోనేపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ముందుంది 'యుద్ధ గండం'.. ట్రంప్‌నకు భారీ షాక్?




ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి వారం రోజులవుతోంది. ఈ యుద్ధం పశ్చిమాసియాలో తొమ్మిది దేశాలకు విస్తరించింది. ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించకపోవడం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ సైన్యం ఎక్కడా తగ్గకుండా శక్తిమేరకు పోరాడుతోంది. ఇజ్రాయెల్‌తోపాటు పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలకే లక్ష్యంగా దాడులకు దిగుతోంది. ఈ ఘర్షణ మరింత ముదిరే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సొంతదేశంలో అసంతృప్తి మొదలైనట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై యుద్ధాన్ని అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. ఈ ఘర్షణను త్వరగా ముగించకపోతే మిడ్‌టర్మ్ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తాయని, చివరకు ట్రంప్‌కు పదవీ గండం తప్పదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్‌ను ఎలాగైనా లొంగదీసుకోవడానికి అమెరికా సైన్యం వనరుల సమకూర్చుకుంటోంది. తమ సైన్యాన్ని, ఆయుధాలను పశ్చిమాసియాకు తరలిస్తోంది. ఈ యుద్ధం మరో ఆరు నెలలకుపైగానే.. అంటే సెపట?ంబర్ దాకా కొనసాగే పరిస్థితి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మరణిస్తే యుద్ధం ముగిసిపోతుందని, ఇరాన్ తలవంచడం ఖాయమని, అక్కడ ప్రభుత్వం మారిపోతుందని ఇజ్రాయెల్, అమెరికా భావించాయి. కానీ, క్షేత్రస్థాయిలో జరుగున్నది మరొకటి. ఖమేనీ హత్యపట్ల ఇరాన్ ప్రజలు ప్రతీకారంతో రగిలిపోతున్నారు. ఇజ్రాయెల్, అమెరికాలకు వ్యతిరేకంగా వారంతా ఒక్కతాటిపైకి వస్తున్నారు.

### ముందస్తు ప్రణాళిక లేని యుద్ధం

సుదీర్ఘ యుద్ధానికి ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా సైతం సిద్ధమైనట్లే కనిపిస్తోంది. అమెరికా రక్షణ శాఖ ఇరాన్‌లో నిఘా కార్యకలాపాలు ముమ్మరం చేస్తోంది. అదనంగా మిలటరీ ఇంటెలిజెన్స్ అధికారులను ఫ్లోరిడాలోని తమ ప్రధాన కార్యాలయానికి పంపించాలని పెంటగాన్‌కు యూఎస్ సెంట్రల్ కమాండ్ విజ్ఞప్తి చేసింది. మరోవైపు రష్యా నుంచి 30 రోజులపాటు చమురు దిగుమతి చేసుకోవడానికి భారత్‌కు అమెరికా తాత్కాలికంగా మినహాయింపు ఇచ?చంది. పశ్చిమాసియాలో యుద్ధం ముగిసి, సాధారణ పరిస్థితులు నెలకొనడానికి చాలా రోజులు పడుతుందని అమెరికా భావిస్తున్నట్లు సమాచారం. ముందస్తు ప్రణాళికతో జరిగే యుద్ధాలు కొన్ని నెలలపాటు కొనసాగుతుంటాయి. ఇరాన్‌లో యుద్ధానికి అప్పటికప్పుడు ప్రణాళిక తయారుచేశారు. ముందస్తు సన్నద్ధత అంటూ ఏదీ లేదు. అందుకే ఇది ఎప్పుడు ఆగిపోతుందో చెప్పలేని పరిస్థితి.

### ట్రంప్‌కు నష్టమెందుకు?

అమెరికాలో నవంబర్‌లో మిడ్‌టర్మ్ ఎన్నికలు జరగాల్సి ఉంది. ట్రంప్ రెండేళ్ల పాలన పూర్తి కావడానికి ముందు ఈ ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఇరాన్ యుద్ధం ఈ ఎన్నికలపై గట్టి ప్రభావం చూపడం తథ్యమని అంటున్నారు. ట్రంప్ అనవసరంగా ఈ యుద్ధం తెచ?చపెట్టారన్న అభిప్రాయం అమెరికాలో వ్యక్తమవుతోంది. పశ్చిమాసియాలో మరో యుద్ధాన్ని తాము కోరుకోవడం లేదని అంటున్నారు. వీరిలో ట్రంప్ సొంత పార్టీ నేతలు కూడా ఉన్నారు. రిపబ్లికన్ పార?టలో చీలిక కనిపిస్తోంది. ట్రంప్‌ను వ్యతిరేకించేవారు ఎక్కువవుతున్నారు. తన మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ అండతోనే ఇరాన్‌పై దాడులు ఆరంభించామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు ప్రకటించారు. తద్వారా ట్రంప్ పోద్బలంతోనే ఇరాన్‌లో నిప్పుల కుంపటి రగించారని అమెరికన్లు నిర్ధయానికొచ్చారు. అసలు ఖమేనీని హత్య చేయడం వెనుక ఔచిత్యం ఏమిటని ప్రశ?నస్తున్నారు. గత అమెరికన్ అధ్యక్షులు ఇరాన్‌పై యుద్ధానికి ఇష్టపడలేదు. ఆ పని మొదట తానే చేశానని ట్రంప్ గొప్పగా చెప్పుకోవడం ప్రజలకు రుచించడం లేదు. యుద్ధ ప్రభావం ఇప్పటికే మొదలైంది. ధరలు పెరుగుతున్నాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే సూచనలున్నాయి. ఇవన్నీ ట్రంప్‌కు సవాలుగా మారుతున్నాయి. మిడ్‌టర్మ్ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు లభిస్తే అధ్యక్ష పదవి నుంచి ట్రంప్ తప్పుకోవాలన్న డిమాండ్లు సొంత పార?టలోనే ఊపందుకోవచ్చు. అది ప్రజా ఉద్యమంగా మారితే ట్రంప్ మధ్యలోనే దిగిపోక తప్పదని విశ్లేషకులు తేల్చిచెబుతున్నారు.

# మళ్లీ బలపడిన బంధం



దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఒకసారి దెబ్బతింటే అతుక్కోవటం అంత సులభం కాదు. అందుకు సుదీర్ఘ కాలం పడుతుంది. గత రెండేళ్లుగా అందుకోసం తెర వెనుక సాగిన ప్రయత్నాలన్నీ ఫలించి కెనడా ప్రధాని మార్క్ కార్నీ మన దేశంలో నాలుగు రోజులు పర్యటించారు. ఈ సందర్భంగా పలు కీలకమైన ఒప్పందాలు కూడా కుదిరాయి. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం రూ. 4.65 లక్షల కోట్లకు చేరుకునేలా ఇరుదేశాలూ కృషి చేయాలన్న నిర్ణయం జరిగింది. అలాగే అణు విద్యుదుత్పాదన కోసం ఇప్పుడు సరఫరా చేస్తున్న యురేనియంను మరింత పెంచటానికి కెనడా అంగీకరించింది. దీని విలువ రూ. 17,403 కోట్లు. ఇవిగాక పునరుత్పాదక ఇంధన వనరులతో సహా పలు అంశాల్లో ఒప్పందాలు కుదిరాయి. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు... రెండూ అకారణంగా ఇరాన్‌పై విరుచుకుపడుతున్న పర్యవసానంగా పశ్చిమాసియాతో పాటు ప్రపంచమంతా అలుము కున్న అస్థిర వాతావరణం నేపథ్యంలో భారత్, కెనడా తమ సంబంధాలను మెరుగు పరుచుకోవటం మంచి సందేశం పంపుతుంది. ఖలిస్తానీ వేర్పాటువాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు 2023లో హతమార్చాక భారత్, కెనడాల సంబంధాలు దెబ్బతినటం నిజమే కావొచ్చు గానీ... అంతకు చాన్నాళ్లముందే అప్పటి కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో అనుసరించిన విధానాలు ఇరుదేశాల మధ్యా పొరపొచ్చాలు పెంచాయి. కెనడాలో చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్న సిక్కుల ఓటుబ్యాంకు కోసం ఆయన వేర్పాటువాదులను ప్రోత్సహించారు. భారత్‌లో నేరాలు చేసి వచ్చిన వేర్పాటువాదులను అప్పగించేందుకు ఆయన ప్రభుత్వం నిరాకరించేది. అందుకే 2018లో ట్రుడో మన దేశం పర్యటనలో ఘనమైన స్వాగత సత్కారాలు లభించలేదు. ట్రుడోను భారత్ అవమానించిందంటూ కెనడా మీడియా వ్యాఖ్యానించింది కూడా! నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉన్నదంటూ కెనడా ఆరోపించటం, అక్కడి మీడియాలో పుంఖానుపుంఖాలుగా కథనాలు రావటం అసలే అంతంత మాత్రంగా ఉన్న సంబంధాలు మరింత క్షీణించటానికి దోహదపడ్డాయి. వేర్పాటువాదులను ఆదరిస్తే జరిగేదేమిటో ట్రుడోకు నిరుడు ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికలకు ముందే తెలిసొచ్చింది. ట్రుడో నాయకత్వం కొనసాగితే లిబరల్ పార్టీ ఓడిపోతుందని సర్వేలు తేల్చటంతో ఆయన రాజీనామా చేయకతప్పలేదు. అనంతరం వచ్చిన మార్క్ కార్నీ స్వల్పకాలంలోనే సమర్థుడిగా పేరుతెచ్చుకుని పార్టీ విజయావ కాశాలు పెంచగలిగారు. మెరుగ్గా కనబడిన విపక్ష కన్జర్వేటివ్ పార్టీ వెనకబడటం మొదలైంది. ఈలోగా అమెరికాలో ట్రంప్ ఏలుబడి మొదలైనాక ఆయన కెనడాను 51వ రాష్ట్రంగా విలీనం చేసుకుంటామనటంతో పాటు ఏకపక్షంగా సుంకాలు విధించటం ట్రంప్‌కు సన్నిహితంగా మెలిగిన ఆ మితవాద పార్టీ ప్రాభవాన్ని దెబ్బతీసింది. నిరుడు కెనడాలో జరిగిన జీ--7 శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ వెళ్లాక దౌత్యసంబంధాలు చిగురించటం మొదలైంది. అంతక్రితం నిజ్జర్ వ్యవహారంలో ఆరోపణలు, దౌత్యవేత్తల పరస్పర బహిష్కరణ వంటివి జరగ్గా, నిరుడంతా ఇరుదేశాలూ హైకమిషనర్లను నియమించుకోవటం, రెండు దేశాల మధ్యా వివిధ మంత్రిత్వశాఖల స్థాయిలో సమన్వయం సాధించటం వంటివి చోటుచేసుకున్నాయి. కోవిడ్ మహమ్మారి కారణంగా అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలూ పల్టీలు కొడుతుండగా, ట్రంప్ అధ్యక్షుడయ్యాక విధిస్తున్న సుంకాలు మరింత కుంగదీస్తున్నాయి. కెనడా కూడా చాలావిధాల దెబ్బతింది. ఈ పరిస్థితుల్లో వాణిజ్యాన్ని విస్తరించుకోవటం ఆ దేశానికి తప్పనిసరైంది. ఇటు మన దేశం కూడా రాగల కాలంలో విద్యుదుత్పాదనను విశేషంగా పెంచాలని భావిస్తోంది. ప్రస్తుతం మన అణువిద్యుదుత్పాదన 6,780 మెగావాట్లు మాత్రమే. వచ్చే దశాబ్ది ప్రారంభానికి ఇది 22,500 మెగావాట్లకు చేరాలి. 2047 నాటికి 100 గిగావాట్లు విద్యుత్ ఉత్పత్తయితే తప్ప మన అవసరాలు తీరబోవన్న అంచనాలున్నాయి. పదేళ్లపాటు యురేనియం ఎగుమతి చేసేందుకు కెనడాతో కుదిరిన ఒప్పందం ఇందుకు దోహద పడుతుంది. అయితే ఇరు దేశాల మధ్యా ఇంకా అపోహలు లేకపోలేదు. కలిసి కదలటం మొదలుపెడితే, స్నేహసంబంధాలు మెరుగవుతుంటే అలాంటివి పటాపంచలవుతాయి. ఆ దిశగా కార్నీ పర్యటన ఒక ముందడుగు.

# అక్షరాలా ఉగ్రవాద చర్య



ఒకపక్క చర్చలు సాగుతుండగా అన్ని రకాల నీతి నియమాలనూ కాలదన్ని ఇరాన్‌పై దండయాత్ర ప్రారంభించిన అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దిగజారుడుతనం ఉన్నకొద్దీ మితిమీరుతోంది. మంగళవారం రాత్రి శ్రీలంక తీరానికి సమీపంలో హిందూ మహాసముద్ర జలాల్లో 130 మంది నావికులతో ప్రయాణిస్తున్న ఇరాన్ యుద్ధనౌక 'ఐఆర్ఐఎస్ దేనా'పై జలాంతర్గామి ద్వారా దొంగదెబ్బ తీసి 92 మంది నావికుల మృతికి కారణం కావటం ఆ వరస లోనిదే. భారత నావికాదళం ఆహ్వానంపై విశాఖలో 'మిలన్--2026' నావికాదళ విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెడుతుండగా ఈ దాడి జరిగింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారి అణు జలాంతర్గామి ద్వారా టార్పెడోను ప్రయోగించి నౌకను ధ్వంసం చేశామని అమెరికా సంబరంగా ప్రకటించుకుందిగానీ... ఈ చర్య అనేక విధాల ఖండనార్హమైనది. భద్రతా మండలిలో రష్యా, చైనాలు చెప్పినట్టు 'అంతర్జాతీయ ఉగ్రవాద చర్య'. ఆ రెండు దేశాల వల్లా ఉద్రిక్తతలు పెరగటం ఒక్కటే కాదు... ఆ బాంబులు, క్షిపణుల్లో వాడే రసాయనాల వల్ల పర్యావరణానికి పెను ముప్పు కలుగుతుంది. ధ్వంసమైన నౌక నుంచి లీకవుతున్న చమురు వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని శ్రీలంక వ్యక్తం చేస్తున్న ఆందోళన కూడా సహేతుకమైనది. ఘర్షణ జరుగుతున్న ప్రాంతానికి ఆ నౌక వేలాది కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశాలకుండే సార్వభౌమత్వం వాటికి సంబంధించిన నౌకలకు సైతం వర్తిస్తుంది. ముఖ్యంగా ఘర్షణ ప్రాంతాల్లో కాక ప్రశాంత జలాల్లో పయనించే సైనిక నౌకలను 'నిరపరాధ' నౌకలంటారు. ముందస్తు సమాచారంతో వెళ్లే ఆ నౌకలపై ఎవరూ దాడి చేయరు. ప్రాదేశిక సముద్ర ప్రాంతం, దాని చేరువ ప్రాంత జలాల్లో వెళ్లే యుద్ధ నౌకల విషయంలో పాటించాల్సిన నీతిపై 1958లో అంతర్జాతీయ ఒడంబడిక కుదిరింది. దానిపై అందరితోపాటు అమెరికా కూడా సంతకం చేసింది. దాన్ని బేఖాతరు చేయటం దానికదే పెద్ద నేరం. ఇదెక్కడి రణనీతి? మన ఆహ్వానంపై వచ్చి వెడుతున్న అతిథి వంటిది ఆ నౌక. మన మిత్రదేశంగా ఉంటూ మన సంప్రదాయాలను ఉల్లంఘించి దానిపై దాడి చేయటం అమెరికా అమిత్ర చర్య. హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని శాంతి మండలంగా ఉంచాలని దశాబ్దాలుగా మన దేశం చేస్తున్న కృషికి తూట్లు పొడవటం కూడా! మనకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అణు జలాంతర్గామిని ఇటువైపు పంపడం ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టం ఒడంబడిక రీత్యా కూడా అత్యంత దారుణమైనది. 2021లో కూడా ఎలాంటి సమాచారమూ లేకుండా లక్షద్వీప్ సమీపంలో అమెరికా నావికా విన్యాసాలకు తెగబడింది. అందుకే భారత నావికాదళ మాజీ అధిపతి అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్ చెప్పినట్టు ఇది మన సరిహద్దుల్లోకి యుద్ధాన్ని విస్తరింపజేయటంతో సమానం. కనుక అమెరికాకు మన అసంతృప్తిని తెలియజేయటం అత్యంత అవశ్యం. మిలన్ అంటే స్నేహపూర్వక కలయిక లేదా సమ్మేళనం. అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాలకు మన దేశం ఆ పేరు పెట్టడంలోనే సుహృద్భావం, సహకారం, ఐక్యత ధ్వనిస్తున్నాయి. అంతర్జాతీయ నిబంధనలు పాటిస్తూ సముద్ర జలాల భద్రత కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలన్నది ఈ సమ్మేళనం ఆంతర్యం. అన్నిటికన్నా ముఖ్యం-- ప్రశాంత జలాల్లో ఇటువంటి దాడి జరిగితే గాయాల పాలైన నావికాదళ సభ్యుల్ని కాపాడటానికి ప్రయత్నించాలన్నది అన్ని దేశాల నావికా దళాలు పాటించే అలిఖిత నియమం. ఈ ఘనకార్యం తర్వాత అమెరికా జలాంతర్గామి కనీసం అక్కడ అర క్షణమైనా నిలబడే ప్రయత్నం చేయకుండా పరారైన తీరు సిగ్గుచేటైనది. అంతర్జాతీయ చట్టాలతోపాటు స్వదేశీ చట్టాలను కూడా ఉల్లంఘించి యుద్ధం మెదలెట్టిన ట్రంప్ తాను ఎవరికీ జవాబుదారీ కాదనుకుంటున్నారు. దీన్నెవరూ అంగీకరించకూడదు. అమెరికా, ఇజ్రాయెల్‌ల తప్పుడు చర్య వల్ల పశ్చిమాసియా రణరంగంగా మారి ఎగుమతులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మరో నెల్లాళ్లవరకే వంటగ్యాస్ నిల్వలున్నాయంటున్నారు. దీనికితోడు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతాయి. ఆ రెండు దేశాల తప్పుడు చర్యను ఖండించటానికి ప్రభుత్వాలు సంశయిస్తున్న వేళ ఆ దేశాల ప్రజలతో సహా ప్రపంచమంతా ముక్తకంఠంతో నిరసిస్తే తప్ప ఈ దుండగం ఆగదు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com

# ప్రజా సమస్యల పరిష్కారానికి మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలి..

### మార్చి 09న జిల్లాలో యధావిధిగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు..

### జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగలి

కాకినాడ, మహి న్యూస్, మార్చి 08 : మార్చి నెల 09 తేదీన కాకినాడ జిల్లాలో పీజీఆర్ఏ, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా స్థాయిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు కాకినాడ కలెక్టరేట్ వివేకానంద కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ అంశాలపై రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లాస్థాయి అధికారులు అందరూ విధిగా ఈ కార్యక్రమాలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా కలెక్టరేట్ లో నూతనంగా ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా సోమవారం ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు తమ సమస్యలకు సంబంధించిన న్యాయ సలహాలు సూచనలు పొందవచ్చు అని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ప్రాముఖ్యంగా అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవఎశీఖఎ. ఖజూ.న్రశీజ.అఅ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చుని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తారని ఆయన తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## సర్పంచ్ ప్రజలను తప్పుదోవ పట్టించడం సమంజసం కాదు..

### కూటమి నాయకులు




తాళ్లరేవు, మహి న్యూస్, మార్చి. 8.: సుంకరపాలెం సర్పంచ్ టీల్లపూడి నాగేశ్వరరావు స్థానిక ప్రజలను తప్పుదోవ పట్టించడం సమంజసం కాదని స్థానిక తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు చీకట్ల నాగేశ్వరరావు, తాతపూడి నాగేశ్వరరావు అన్నారు. తాళ్లరేవు మండలం పరిధిలోని సుంకరపాలెంలో కూటమి పార్టీ నాయకులు గుంటముక్కల సూరిబాబు, మద్రి అశోక్ కొమ్మిరెడ్డి బద్రి, బృందంతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ విప్ ,ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దృష్టికి గ్రామంలోని సమస్యలను స్థానిక కూటమి నాయకులు తీసుకు వెళ్ళటం వల్ల ఆయన 65 లక్షలు నిధులను కేటాయించారని తెలిపారు. దీంతో గ్రామంలోని వివిధ ప్రాంతాల్లోని నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. స్థానిక సర్పంచ్ అవన్నీ పక్కనపెట్టి తానే స్వయంగా అభివృద్ధి పనులు చేయించినట్లు ప్రజలను తప్పు దోవ పట్టించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు.

## యానాంలో పారామి లటరీదళాల కవాతు





యానాం, మహి న్యూస్, మార్చి 8.: పుదుచ్చేరి అసెంబ్లీ - 2026 ఎన్నికల నేపధ్యంలో యానాం నియోజకవర్గ పరిధిలో బైపాస్ రహదారిలో ఆదివారం రాత్రి ఎస్పీ వరదరాజన్ నేతృత్వంలో పారామిలటరీ దళాలు కవాతును నిర్వహించారు. మరో వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం ఎన్నికల కోడ్ అమలులోనికి రానుంది. యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపధ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునే విధంగా ఓటర్లలో మనోధైర్యాన్ని కల్పించడం, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా బైపాస్ రహదారి, భీమ్నగర్, ఆర్ఎ ఒ ఆఫీసు తదితర పారామిలటరీ దళాల కవాతు సాగింది. ఈ కార్యక్రమంలో సీఐ షణ్ముకసుందరం, ఎస్సై పునీత్రారాజ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళాదినోత్సవ వేడుకలు

## ఉత్సాహంగా ఉచిత బోటు షికారు




యానాం, మహి న్యూస్, మార్చి 8.: యానాంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా



పుదుచ్చేరి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో సిఎం రంగసామి ఆదేశాల మేరకు వాటర్స్పోర్ట్స్ విభాగంలో స్థానిక గౌతమీగోదావరిలో ఉచితబోటుషికారుకు మహిళలకు అవకాశం కల్పించడంతో ఉత్సాహంగా తరలివచ్చారు. పర్యాటకబోట్లలో గోదావరి లో విహరిస్తూ ఆనందంగా మహిళలు గడిపారు. ఆర్ఎఒ శివరాజ్మీనా ఆదేశాలతో సీగల్స్ వాటర్స్పోర్ట్స్ అధికారి మురళీధరన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ఉచితబోటు షికారు కు యానాంనుంచే కాకుండా ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాల పరిధిలో వివిధ గ్రామాలనుంచి మహిళలు తరలివచ్చారు. అంతకుముందు ప్రభుత్వరంగ సీగల్స్ రెస్టారెంట్లో మహిళాసిబ్బంది కేక్ కట్చేసి మహిళాదినోత్సవ సంబరాలు జరుపుకున్నారు. అదేవిధంగా యానాం పోలీస్ స్టేషన్ లో సైతం ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో మహిళాదినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సీఐ షణ్ముగసుందరం, ఎస్సైలు పునీత్రాజ్, రమణమూర్తి, ఎఎస్సై కళావతి, కానిస్టేబుల్ యడ్ల శాంతి తదితరులు పాల్గొన్నారు

# మహిళా సంక్షేమంలో కాకినాడ జిల్లా ప్రగతి




కాకినాడ, మహి న్యూస్, మార్చి 8 :జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజి ద్వారా 96,030 మంది స్వయం సహాయక సంఘం మహిళలకు రూ .1457.84 కోట్లు ఋణాలు లక్ష్యం కు గాను 1,02,770 మంది మహిళలకు రూ .1460.54 కోట్ల ఋణాలు ఇప్పించి 100 శాతం ప్రగతి సాధించడం జరిగింది. ఉన్నతి ద్వారా 1960 మంది లబ్ధి దారులకు రూ .10.60 కోట్లు జీవనోపాదులు కల్పించుటకు లక్ష్యం కాగా ఇప్పటివరకు 1646 మంది లబ్ధిదారులకు రూ .10.60 కోట్లు జీవనోపాది ఋణాలు ఇప్పించి 100 శాతం లక్ష్యం పూర్తి చేయుట జరిగిందన్నారు. పిఎం అజయ్ స్కీం ద్వారా ఈ ఏడాది 172 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఋణాలు ఇప్పించుటకు లక్ష్యం గా నిర్ణయించి మొత్తం 172 మంది లబ్ధిదారులకు రూ.1.72 కోట్లు ఋణాలు అందించడం జరిగిందన్నారు . మహిళా ఉత్పత్తులకు మార్కెటింగ్ ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా వుమెన్ లెడ్ ఎంటర్ ప్రేన్యుర్ ద్వారా 4,600 మంది మహిళకు రూ .57.06 కోట్ల రూపాయలు ఋణాలు మంజూరు చేయించి 124 శాతం ప్రగతి సాధించడం జరిగిందన్నారు స్త్రీ నిధి ఋణాలు ద్వారా ఈ సం . 25,363 మంది మహిళలకు రూ .253.53 కోట్లు లక్ష్యం నిర్ణయించగా మొత్తం 27,417 మంది మహిళలకు రూ .253.80 కోట్లు ఋణాలు అందజేశామన్నారు పిఎంఎఫ్ యంఈ ఒ పిఎంఈజిపి పథకాల ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తలకు వ్యాపారాలు నిర్వహించుటకు , వ్యాపార అభివృద్ధి చేసుకొనుటకు గాను మొత్తం 103 మంది మహిళా పారిశ్రామిక వేత్తలకు రూ .3.92 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు . పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజి ద్వారా 33,000 మంది స్వయం సహాయక సంఘం మహిళలకు రూ .330 కోట్లు ఋణాలు లక్ష్యంకు గాను 28,270 మంది మహిళకు రూ .434.62 కోట్ల ఋణాలు ఇప్పించి 131 శాతం ప్రగతి సాధించుట జరిగిందని వివరించారు. స్వయం ఉపాధి కార్యక్రమం (ఎస్ ఈ పి 1) ద్వారా ఉపాధి కల్పించే కార్యక్రమంలో భాగంగా 383 మంది మహిళలకు రూ .3.86 కోట్లు లక్ష్యం కాగా మొత్తం 362 మంది మహిళలకు రూ .10.53 కోట్లు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. స్వయం ఉపాధి కార్యక్రమం (ఎస్ఈపి జి) ద్వారా 4 మందికి రూ .2 లక్షలు లక్ష్యం కాగా మొత్తం 3 గురు మహిళలకు రూ .21 లక్షలు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు . పట్టణ ప్రాంత మహిళలకు జీవనోపాదులు కల్పించి వారి కుటుంబ ఆదాయాలు పెంచే ప్రణాళిక లో భాగంగా 1242 మందికి 24.84 కోట్లు లక్ష్యం గా నిర్ణయించి మొత్తం 1657 మంది మహిళలకు రూ.41.42 కోట్లు జీవనోపాదులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు . ఈ ఆర్థిక సం.లో 5064 టిడ్కో గృహాలకు గాను రూ.184.84 కోట్లు లబ్ధి చేకూర్చవలసి ఉండగా ఇప్పటివరకు 4139 మందికి రూ .137.20 కోట్లు లబ్ధి చేకూర్చుట జరిగింది . ఈ ఏడాది మొత్తం 234 కొత్త సంఘాలు ఏర్పాటు చేయవలసి ఉండగా 222 సంఘాలు కొత్తగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు . మహిళా అభివృద్ధి మరియు సమగ్ర శిశు సంక్షేమ శాఖ ద్వారా సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా బాల సంజీవని పథకం ద్వారా 10 లక్షల 55 వేల 256 మంది బాలలకు రూ.49.67 కోట్లు లక్ష్యంగా నిర్ణయించగా ను 10 లక్షల 55 వేల 256 మంది బాలలకు రూ.49.67 కోట్లు లబ్ధి చేకూర్చి పూర్తి 100 శాతం ప్రగతి సాధించుట జరిగిందన్నారు. మిషన్ వాత్సల్య కార్యక్రమం లో భాగంగా వివిధ ప్రమాదాలలో తల్లి తండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు 503 మందికి రూ .2.41 కోట్లు లబ్ధి చేకూర్చడం జరిగింది . మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవివై) కార్యక్రమం ద్వారా 6214 మందికి 2.09 కోట్లు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు .

# మహిళగా పుట్టినందుకు మనం గర్వపడాలి

## పిల్లల చదువు చాలా ముఖ్యం, వారిని విద్యావంతులను చేయండి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మహి న్యూస్, మార్చి 08:- మహిళగా పుట్టినందుకు మనమందరం గర్వపడాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మహిళల నుద్దేశించి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ఈ వేదికపై ఉండటానికి కారణమైన తన తల్లికి మరియు అక్కడే ఉన్న మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, గత 8 నెలల్లో 83 బాల్య వివాహాలను ఆపామని కలెక్టర్ తెలిపారు. ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబమంతా బాగుంటుందని, మహిళలకు ఉన్న శక్తి అపారమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు తల్లే మొదటి దైవమని, ఆడపిల్లలను బాగా చదివించి, వారు తమ కాళ్ల మీద తాము నిలబడే వరకు పెళ్లిళు చేయవద్దని కలెక్టర్ తల్లులకు తెలిపారు. అదే విధంగా కొడుకులకు ఆడపిల్లలను గౌరవించడం నేర్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఏ విధంగా అండగా నిలుస్తుందో వివరించారు. ఎస్హీ బ్యాంక్ లింకేజ్ కింద సుమారు 1,30,000 మంది మహిళలకు 1200 కోట్ల రూపాయల చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. స్త్రీ నిధి కింద 25,341 మంది మహిళలకు 195 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించారన్నారు. ఉన్నతి మరియు పీఎం అజయ్ కింద 208 స్వయం సహాయక బృందాలకు 176 కోట్ల రూపాయల మద్దతు లభించిందన్నారు. ఉన్నతి పథకం కింద 1698 మంది మహిళలకు 8.5 కోట్ల రూపాయల సాయం అందించిందన్నారు. ఇతర పథకాలైన సీఐఎఫ్, వీజీఎఫ్, వీఆరఎఫ్ మరియు పీఎంఈజీపీ వంటి వివిధ పథకాల ద్వారా వేలాది మంది మహిళలకు కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయన్నారు. మెప్మా కి సంబంధించి 4502 స్వయం సహాయక బృంద సభ్యులకు 613 కోట్ల రూపాయలతో ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు. పీఎంఈఎఫ్ఈ పథకం కింద మహిళా యూనిట్ల సంఖ్యను పెంచాలని, తద్వారా ఎక్కువ మంది మహిళలు ప్రయోజనం పొందేలా చూడాలని కలెక్టర్ ఎల్ డి ఎం ను ఆదేశించారు. మొత్తం మీద సుమారు 1,62,782 మంది మహిళలకు 2200 కోట్ల రూపాయల ఆర్థిక సహాయంతో ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. వసతి గృహాలు కావాలని కోరుతున్నారని ఇప్పటికే చాలా వరకు సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, మైనారిటీ హాస్టళ్లు ఉన్నాయని, అయినప్పటికీ సోషల్ వెల్ఫేర్ 7 హాస్టళ్లు, బిసి వెల్ఫేర్ లో 4 హాస్టళ్లు, అలాగే కేజీబీవీ కింద 12 కొత్త హాస్టళ్లు కావాలని ప్రభుత్వాని కోరడం జరిగిందన్నారు. ఇదే కాకుండా సీజనల్ హాస్టళ్లు కూడా మనం ఈ సంవత్సరం 78 ఓపెన్ చేసుకున్నామని ఇందులో 4,000 మంది పిల్లల్ని మనం చదివించడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు పనుల కోసం వలస వెళ్లేటప్పుడు పిల్లలను కూడా వెంట తీసుకెళ్లడం వల్ల వారి చదువు ఆగిపోతుందని, వారికి సీజనల్ హాస్టళ్లలో ఉంచి చదివించాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా ఈ జిల్లాలో కేవలం 57% అక్షరాస్యత మాత్రమే ఉందని, అక్షరాస్యత ను ఇంప్రూవ్ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం 'అక్షరాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఇందులో మిగతా అన్ని జిల్లాలు కలిపి దాదాపు 18-19 లక్షల మంది రిజిస్టర్ అయితే, మన జిల్లా ఒక్కటే 1,61,000 మంది మహిళలను, వృద్ధులను ఆ ప్రోగ్రామ్ లో చేర్చిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2 నెలల పాటు చదువు నేర్చుకున్నారన్నారు. వారికి ప్రీ-ఫైనల్ టెస్ట్ కూడా ఇటీవలే జరిగిందన్నారు. అందులో 94% మంది పాస్ అయ్యారన్నారు. దీనివల్ల మన జిల్లా అక్షరాస్యత శాతం పెరుగుతుందని ఆశిస్తున్నాను అన్నారు. ఓర్వకల్లులో అనేక పరిశ్రమలు వస్తున్నాయని, దీనివల్ల భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. కాబట్టి దయచేసి ప్రతి ఒక్కరు మీ పిల్లల్ని చదివించాలని కలెక్టర్ కోరారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదు, జీవం లేదు, స్త్రీ లేని ప్రపంచాన్ని మనం ఊహించుకోవడం కూడా చాలా కష్టం అన్నారు. ఎప్పుడైతే స్త్రీని గౌరవిస్తారో, అటువంటి సమాజమే అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యంగా మన సంప్రదాయంలో స్త్రీలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ దేవతలు ఉంటారని మనం ఎప్పటి నుంచో చూస్తున్నాం అన్నారు. అటువంటి స్త్రీ పట్టుదల, ఓర్పు, సహనం మరియు త్యాగాలను మనం ఎప్పుడూ మరువకూడదన్నారు. ప్రతి మగవాని విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందనేది ఎంత సత్యమో, ఈరోజు స్త్రీలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండటం కూడా అంతే నిజం అన్నారు. రాజకీయాల్లో గ్రామ స్థాయి వార్డు సభ్యుల నుండి పార్లమెంటు స్థాయి వరకు మహిళలు రాణిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1995లో పొదుపు ఉద్యమాన్ని (డ్వాక్రా) ప్రారంభించారన్నారు. ప్రతిరోజూ రూపాయి, నెలకు 30 రూపాయలు పొదుపు చేస్తూ ఆర్థికంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారన్నారు. దీనివల్ల కుటుంబ బాధ్యతల్లో భర్త సంపాదనతో పాటు మహిళలు కూడా తోడ్పడే అవకాశం కలిగిందన్నారు. ఓర్వకల్లు మండలం డ్వాక్రా సంఘాల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అవార్డును గెలుచుకోవడం చాలా గర్వకారణం అన్నారు. ఒకప్పుడు నెలకు 30 రూపాయలు పొదుపు చేసిన మహిళలు, ఈరోజు 1000 రూపాయల వరకు పొదుపు చేసే స్థాయికి ఎదిగారన్నారు. వారు వ్యాపారాలు చేస్తూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ మంచి పొజిషన్‌లో ఉంచారన్నారు. మన ప్రభుత్వం మహిళల విద్య, ఆరోగ్యం మరియు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి ఆశయం అన్నారు. ఓర్వకల్లు మండలంలో ఎమ్ ఎస్ ఎమ్ ఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) ద్వారా మహిళలకు ఉపాధి కల్పించేందుకు 'దిలీప్' అనే సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ఈ సంస్థ మహిళలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రుణాలు మరియు వ్యాపార సలహాలను అందిస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ, సమాజంలో ఇంకా బాల్య వివాహాలు, అత్యాచారాలు మరియు ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయని, వీటిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోనూ అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. మహిళలు ముఖ్యమంత్రులుగా , ప్రధానమంత్రులుగా , మరియు రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టి దేశాన్ని నడిపించారన్నారు. విద్యా రంగంలో గొప్ప డాక్టర్లుగా, సైంటిస్టులుగా, చీఫ్ సెక్రటరీలుగా అత్యున్నత పదవులను అధిరోహించారన్నారు.. మహిళలు క్రమశిక్షణతో కష్టపడి ఏ రంగంలోనైనా రాణించగలరని నిరూపితమైందన్నారు. ఇటీవల వచ్చిన యూపీఎస్సీ ఫలితాల్లో కూడా టాప్ ర్యాంకర్లలో మహిళలే ఎక్కువగా ఉండటం దీనికి నిదర్శనం అన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం వల్ల దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ పట్టుదల, ఓర్పు, సహనం మరియు త్యాగాలను మనం ఎప్పుడూ మరువకూడదన్నారు. ప్రతి మగవాని విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందనేది ఎంత సత్యమో, ఈరోజు స్త్రీలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండటం కూడా అంతే నిజం అన్నారు. రాజకీయాల్లో గ్రామ స్థాయి వార్డు సభ్యుల నుండి పార్లమెంటు స్థాయి వరకు మహిళలు రాణిస్తున్నారన్నారు. అనంతరం డి.ఆర్.డి.ఏ, మెప్మా ద్వారా వివిధ పథకాల కింద లబ్ధిదారులైన దాదాపు లక్షా అరవై రెండు వేల మందికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 2,201 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్ రూపంలో అందించారు.

డిఆర్డిఏ, మెప్మా మహిళా పారిశ్రామికవేత్తలు, మహిళా అధికారులను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షురాలు కృష్ణమ్మ, డి ఆర్ ఓ సి. వెంకట నారాయణమ్మ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ సావిత్రి , వడ్డెర సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చంద్రిక , వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవ లక్ష్మీ , బొందిల్ల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, ఓర్వకల్లు పొదుపు ఐక్య సంఘం అధినేత విజయ భారతి, డి ఆర్ డి ఏ పిడి రమణారెడ్డి, జిల్లా అధికారులు, పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లి అమూల్య ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం




రాజోలు, మహిన్యూస్, మార్చి 08: రాజోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని తెలుగు మహిళలు, ఇతర మహిళా సోదరీమణులు అందరితో కలిసి కేక్ కటింగ్ చేసి, ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి మహిళకు బహుమతి ప్రదానం చేసి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమూల్య మాట్లాడుతూ స్వర్గీయ సావిత్రిబాయి పూలే, రమాబాయి అంబేద్కర్, ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు, లాంటి మహిళా మణులు ఎందరో మనకు ఆదర్శంగా నిలిచారని, అసలైన శక్తి మనలో ఉన్న మనోధైర్యమేనని, మనము ఏ స్థాయికి ఎదగాలని అనుకున్నా మన మనోధైర్యమే మన బలమని, మనపై ఎవరు రాళ్లు విసిరినా వాటిని మనం పువ్వులుగా తీసుకోవాలని, మనలోని పిరికితనమే మనకు శత్రువు అని, మనం ఆశించిన స్థానానికి చేరుకోవాలంటే మన మనోధైర్యమే మనల్ని నడిపిస్తుందని అన్నారు. అందరూ ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమానికి



విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మహిళా దినోత్సవ వేడుకలో శ్రీమతి బందెల పద్మ, శ్రీమతి మంగెన భూదేవి, శ్రీమతి చుట్టుగుళ్ళ దుర్గావతి కిషోర్, శ్రీమతి అడబాల రమాదేవి, రాజోలు ఏఎంసీ శ్రీమతి కేతా వెంకటలక్ష్మి, మామిడికుదురు ఏఎంసీ చైర్మన్ శ్రీమతి పెనుమాల లక్ష్మి, శ్రీమతి కోటిపల్లి రత్నమాల, శ్రీమతి చెల్లుబోయిన హెలిన, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీమతి, మందపాటి గంగా శారదాంబ నాగేశ్వరరావు, మట్టా అనంతలక్ష్మి, శ్రీమతి మానేపల్లి సుజాత వేమా, శ్రీమతి పప్పుల సరస్వతీ రమేష్, శ్రీమతి కాకి లక్ష్మీదేవి, శ్రీమతి మోకా పార్వతి, శ్రీమతి మట్టపర్తి లక్ష్మి, శ్రీమతి తాడి రాధ, శ్రీమతి చింతపల్లి లక్ష్మి, శ్రీమతి కడలి దుర్గా పద్మావతి, శ్రీమతి చింతా లక్ష్మి, శ్రీమతి గొల్ల దేవి ప్రియ, జిల్లెళ్ళ నిర్మల బాబు ప్రసాద్, మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు జిల్లెళ్ళ రోజా, శ్రీమతి కంచి స్వాతి, శ్రీమతి తెన్నేటి నిర్మల, శ్రీమతి నాగళ్ళ బేబీ, శ్రీమతి మాగాపు విజయ దుర్గ, శ్రీమతి ఉల్లంపర్తి పద్మ దుర్గాభవాని ప్రసాద్ తదితర మహిళా మణులు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, మండల పార్టీ అధ్యక్షులు తాడి సత్యనారాయణ, ఆడబాల సాయిబాబా, గోనిపాటి రాజు, కట్టా సూరిబాబు, కాండ్రేగుల కృష్ణ, కాండ్రేగుల సత్యనారాయణ, కడలి వెంకటరత్నం కౌరు శ్రీను, పంగం సుధాకర్, అంతర్వేదిపాలెం పుల్లయ్య, గొల్ల జస్పాల్, చిగురుపాటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

## రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



శ్రీకాకుళం, మహి న్యూస్, మార్చి 8: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'శాప్ లీగ్ బ్యాడ్మింటన్ (మాస్టర్స్)' జిల్లా స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో సుమారు 20 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. వివిధ కేటగిరీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారుల వివరాలను జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ వెల్లడించారు. 35 ఏళ్ల పైబడిన పురుషుల సింగిల్స్ విభాగంలో ఏ. మోహన్ రావు విజేతగా నిలవగా, డబుల్స్ విభాగంలో ఏ. మోహన్ రావు, వై. లక్ష్మణరావు జంట విజయం సాధించింది. అలాగే, 35 ఏళ్ల పైబడిన మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కిల్లి హరీష్, ఐ. ఆశాలత జంట విజేతలుగా నిలిచారు. 45 ఏళ్ల పైబడిన పురుషుల సింగిల్స్‌లో నాగేశ్వరి బెనర్జీ బెహరా, డబుల్స్‌లో కె. కిరణ్ కుమార్, పి. శ్యామ్ సుందరరావు జంట ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని డి ఎస్ డి ఓ తెలిపారు.

## మహిళా సాధికారతలో రాష్ట్రంలోనే జిల్లాకు ప్రథమ స్థానం

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడి

శ్రీకాకుళం, మహి న్యూస్, మార్చి 8: మహిళా సాధికారతకు సంబంధించి వివిధ పథకాల అమలులో శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గర్వంగా ప్రకటించారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా సంఘాలకు రూ. 2266 కోట్ల క్రెడిట్ లింకేజీ, శ్రీనిధి ద్వారా రూ. 312 కోట్లు, ఉన్నతి పథకం కింద రూ. 7 కోట్లు అందించి ఆర్థికంగా బలోపేతం చేశామని, అందుకే మన జిల్లా రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని వివరించారు. 'లక్పతి దీదీ' పథకం కింద ఇప్పటికే 5,300 మందిని గుర్తించామని, ఈ ఏడాది లక్ష మందిని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. చదువుకున్న వారితో పాటు చదువు లేని వారు కూడా స్వశక్తితో ముందంజలో ఉండటమే మహిళా శక్తికి నిదర్శనమని కొనియాడారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖ మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్కరూ 'శక్తి యాప్' ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. సమాజంలో ఆడపిల్లలకు జాగ్రత్తలు చెప్పడం కంటే, మగపిల్లలు తప్పు చేయకుండా పెంచడంపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు వారి జీవితాల్లో మార్పు తెస్తున్నాయని పేర్కొన్నారు. డ్వాక్రా రుణ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి, మెప్మా పీడీ, డిఆర్డిఏ పిడి కిరణ్ కుమార్, ఎల్డిఎం శ్రీనివాసరావు మహిళా అధ్యక్షురాలు గంగమ్మ, ఐసిడిఎస్ పిడి రూపవతి, పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల విముక్తి ప్రచార రథం ప్రారంభించిన

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




టెక్కలి, మహి న్యూస్, మార్చి 8 : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ రథం ద్వారా గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, బాలికల హక్కులపై ప్రజల్లో చైతన్యం కల్పించడం చాలా అవసరమని అన్నారు. బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును నాశనం చేస్తాయని,అందుకే ప్రతి కుటుంబం, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, సమాజంలోని ప్రతి ఒక్కరు కలిసి బాల్య వివాహాలను నిరోధించడంలో భాగస్వాములు కావాలి అని సూచించారు. ప్రచార రథం ద్వారా వైద్య, విద్య, సామాజిక సేవలు, హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గ్రామాల వారీగా రథం సందర్శన ద్వారా ప్రజలకు బాలికల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన కల్పించాలని అన్నారు. విధి నిర్వాహణలో అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాల్య వివాహాలను నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## అన్ని సేవలు ఒకే చోట...

## టెక్కలిలో వన్ స్టాప్ కేంద్రం ప్రారంభించిన



టెక్కలి, మహి న్యూస్, మార్చి 8 : మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వన్ స్టాప్ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపదలో ఉన్న మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు వన్ స్టాప్ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలకు ఒకే చోట వైద్య సేవలు, న్యాయ సహాయం, ప్రత్యేక కౌన్సిలింగ్ వంటి సేవలను అందించనున్నట్లు చెప్పారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలకు తక్షణ పరిష్కారం అందించే విధంగా ఈ కేంద్రం పనిచేస్తుందని మంత్రి పేర్కొన్నారు. మహిళల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10 వన్ స్టాప్ కేంద్రాలు మంజూరు కాగా, వాటిలో ఒక కేంద్రాన్ని టెక్కలిలో ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలోని మహిళలకు అత్యవసర సమయంలో సమగ్ర సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, వైద్యులు,తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

శ్రీకాకుళం, మహి న్యూస్, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మహిళలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని, కుటుంబ వ్యవస్థ నుంచి దేశ అభివృద్ధి వరకు ప్రతి రంగంలో మహిళల సేవలు అమూల్యమని మంత్రి పేర్కొన్నారు. మహిళలు శక్తివంతంగా ఎదిగినప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక, విద్యా రంగాలలో పురోగతికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచడం, విద్య మరియు ఆరోగ్య రంగాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించడం, మహిళా సంక్షేమ పథకాలను మరింత బలోపేతం చేయడం ద్వారా మహిళా సాధికారతకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగి తమ ప్రతిభను చాటుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. మహిళల భద్రత, గౌరవం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల శక్తి, ప్రతిభ, సాధనలను గుర్తుచేసుకునే ప్రత్యేక సందర్భంగా నిలుస్తుందని పేర్కొంటూ రాష్ట్రంలోని అన్ని మహిళలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

# మహిళాభ్యున్నతే ప్రభుత్వ ఆశయం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి, మహి న్యూస్, మార్చి 8: రాష్ట్రంలోని మహిళల సమగ్ర అభ్యున్నత సాధించాలన్నదే ప్రభుత్వ ఆశయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం టెక్కలి ఆదిత్య కళ్యాణ మండపంలో మహిళా మండలి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి మహిళ వేడుకలను ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అని, సమాజంలో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించి గౌరవించడం మన అందరి బాధ్యత అని అన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. 1982 సంవత్సరంలో నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత సమాజంలో మహిళలకు పేరు, గుర్తింపు తెచ్చారన్నారు. రాష్ట్రంలో పురుషులతో సమానంగా స్త్రీలకు సమాన హక్కుల కోసం ఎన్టీఆర్ కృషిచేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి ఆలోచనతో భవిష్యత్తులో మహిళలు ఉన్నత స్థితిలో నిలపాలన నిర్ణయంతో డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు రుణాల అందజేసి ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా తోడ్పాటు అందిస్తున్నారన్నారు. నారీమణులు ఆత్మవిశ్వాసంతో సమాజంలోని సవాళ్ళ ను ఎదుర్కోవాలని సూచించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళల సౌకర్యం కోసం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం దిగ్విజయంగా అమలవుతుందని గుర్తు చేశారు. మహిళలకు మరింత సౌకర్యం పెంచేలా వచ్చే రెండు సంవత్సరాల్లో దశలవారీగా ఎలక్ట్రికల్ ఏ సి బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. పిల్లలను విద్య లో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తల్లికి వందనం పథకం కింద 69 లక్షల మంది తల్లుల ఖాతాలో పది వేల కోట్ల రూపాయలను జమ చేసి తల్లులకు గౌరవం తీసుకువచ్చామన్నారు. దీపం క్రింద 3 ఉచిత సిలిండర్లను అందజేశామని పేర్కొన్నారు. 2014- 19 సంవత్సరంలో ఇల్లు కట్టుకుని బిల్లులు మంజూరు కానీ లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయనున్నామన్నారు. 2019 నాటికి పేదలకు18 లక్షల ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కృషి చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కేటాయించినట్లు చట్టం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా జనాభా సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని సి ఎం భావిస్తున్నారని తెలిపారు. ప్రసవం సమయంలో మహిళలకు రూ. 25వేల ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం మహిళా మండల సభ్యులకు బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి, ఉన్నతి, సిఐఎఫ్ రుణాలు రూ. 328 కోట్ల నమూనా చెక్కు ను మంత్రి చేతులమీదుగా అందజేశారు. మహిళలను దుస్సాలువాతో సన్మానించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం కృష్ణమూర్తి, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, కళింగ వైశ్య అధ్యక్షులు బోయిన గోవింద రాజులు, కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషు, డీఎల్ డి ఓ అలివేలుమంగ, ఆర్ డి ఎ ప్రత్యేక అధికారి కరగాన మోహనరావు, ఐసిడిఎస్ పిడి రూపలత, టెక్కలి, కోటబొమ్మాళి ఎంపీడీవోలు రేణుక, ఫణీంద్ర కుమార్, టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల ఏపీఎంలు పి ఉమారాణి, టి మనోరత్నం, టి సూర్యనారాయణ, జి శ్రీనివాసరావు, నియోజవర్గంలోని సి డీపీ ఓ లు, మహిళా మండల సమైక్య అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి కోసం పోరాడిన మహిళకు న్యాయం

### మహిళా దినోత్సవం రోజున బాధిత మహిళకు న్యాయం చేసిన కలెక్టర్

నెల్లూరు, మహి న్యూస్, మార్చి 8: అన్యాక్రాంతం అయిన తన ఇంటిని తిరిగి పొందేందుకు పోరాడిన మహిళకు న్యాయం చేస్తూ, మరోసారి మానవత్వాన్ని చాటిచెప్పారు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పేరం విజయకుమారి గత కొన్ని నెలలుగా తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఆమె తల్లి--తండ్రులు తన తమ్ముడి పెళ్లి కోసం నక్క ఎల్లయ్య వద్ద రూ. 70,000 అప్పుగా తీసుకున్నారు. అయితే ఆ అప్పు తీర్చకముందే వారు మరణించారు. అనంతరం అదనంగా రూ. 2,30,000 కలిపి మొత్తం రూ. 3,00,000గా బలవంతంగా పత్రం రాయించుకున్నారు. నెలకు రూ. 9,000 వడ్డీగా మూడు సంవత్సరాల పాటు ఆమె చెల్లించారు. కాలక్రమంలో వడ్డీతో కలిపి మొత్తం రూ. 3 లక్షలు చెల్లించినప్పటికీ, ఇంకా రూ. 50,000 ఇవ్వాలని చెప్పి ఇంటి పత్రాలు తిరిగి ఇవ్వకుండా ఆ ఇంటిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సి వచ్చిన విజయకుమారి తన పిల్లలతో కలిసి నాలుగు నెలల పాటు తీవ్ర ఇబ్బందులు పడుతూ, బంధువుల ఇళ్లలో తలదాచుకుంటూ జీవనం సాగించారు. చివరికి న్యాయం కోసం ఆమె జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలెక్టరేట్‌లో కలిసి అర్జీ సమర్పించారు. తన ఇంటిని తిరిగి ఇప్పించాలంటూ ఆమె చేసిన వేడుకోలు కలెక్టర్‌ను కదిలించాయి. విషయాన్ని పరిశీలించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా వెంటనే స్పందించి, బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘ కమిషనర్‌కు ఈ నెల 7వ తేదీన (07-03-2026) విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే విచారణ చేపట్టిన అధికారులు పరిస్థితిని పరిశీలించి, నక్క యానదయ్య ఆక్రమణలో ఉన్న ఇంటిని విడిపించి, అసలు యజమాని అయిన విజయకుమారికి అప్పగించారు. నాలుగు నెలలుగా ఇల్లు లేక ఇబ్బందులు పడిన విజయకుమారి, తనకు తిరిగి ఇల్లు అందడంతో ఆనందం వ్యక్తం చేశారు. "నాకు న్యాయం జరిగింది. నా పిల్లలతో మళ్లీ నా ఇంట్లో ఉండగలుగుతున్నాను. కలెక్టర్ కి జీవితాంతం కృతజ్ఞురాలిని" అంటూ ఆమె భావోద్వేగంగా స్పందించారు. ఈ ఘటన ద్వారా బాధితుల సమస్యలపై సత్వర స్పందనతో చర్యలు తీసుకుంటే ప్రజలకు న్యాయం త్వరగా అందుతుందని మరోసారి రుజువైంది. జిల్లా కలెక్టర్ ప్రజల సమస్యల పట్ల సానుభూతితో వెంటనే స్పందిస్తున్నారని జిల్లా ప్రజలు అభినందిస్తున్నారు.

### "అప్పుల పేరుతో అమానుష వేధింపులకు చెక్ - - వడ్డీ వ్యాపారులకు కలెక్టర్ గట్టి హెచ్చరిక" :

అప్పుల వ్యాపారం పేరుతో ప్రజలను వేధించడం, అధిక వడ్డీలు వసూలు చేయడం, బలవంతంగా పత్రాలపై సంతకాలు తీసుకోవడం వంటి అమానుష చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు. అప్పు ఇచ్చిన పేరుతో పేద ప్రజలను మానసికంగా, శారీరకంగా వేధించడం, వారి ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకోవడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన గట్టిగా హెచ్చరించారు. అలాగే, ఇది ఒక్క వ్యక్తికి సంబంధించిన సమస్య మాత్రమే కాకుండా సమాజంలో చాలాచోట్ల కనిపిస్తున్న తీవ్రమైన సమస్య అని ఆయన తెలిపారు. అప్పుల పేరుతో ప్రజలను భయపెట్టి, అవమానపరచి, ఇళ్ల నుంచి వెళ్లగొట్టడం వంటి అమానుష చర్యలకు పాల్పడే వారందరికీ ఇది గట్టి హెచ్చరికగా భావించాలని పేర్కొన్నారు. ప్రజలను వేధిస్తూ అన్యాయంగా వ్యవహరించే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను అధికారులకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## మహిళల హక్కుల రక్షణకు న్యాయ సేవాధికార సంస్థ అండ

### టోల్ ఫ్రీ నంబర్ 15100ను వినియోగించుకోవాలి

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు




శ్రీకాకుళం, మహి న్యూస్, మార్చి 8: సమాజంలో మహిళలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా న్యాయం కోసం పోరాడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. మహిళలకు ఎదురయ్యే చట్టపరమైన చిక్కులను సత్వరమే పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులు కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చని లేదా ప్రభుత్వం కేటాయించిన టోల్ ఫ్రీ నంబర్ 15100కు కాల్ చేసి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని సూచించారు. అమ్మలుగా, చెల్లెళ్లుగా, ఆడపడుచులుగా సమాజానికి అండగా నిలుస్తున్న మహిళలందరికీ ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళల పట్ల గౌరవం పెరగడమే కాకుండా, వారికి చట్టం కల్పించిన హక్కులు సద్వినియోగం అయినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, ఇతర విభాగాల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల సాధికారతకు క్రీడలే ప్రతీక

### జిల్లా ఉపాధి అధికారిణి కొత్తలంక సుధ

### కోడి రామ్మూర్తి స్టేడియంలో 'అస్మిత' అథ్లెటిక్స్ పోటీలు




శ్రీకాకుళం, మహి న్యూస్, మార్చి 8: మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధనలను గుర్తించే రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవమని, ఇది వారి సమానత్వం, సాధికారతకు ప్రతీకగా నిలుస్తుందని జిల్లా ఉపాధి అధికారిణి కొత్తలంక సుధ అన్నారు. ఆదివారం స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జిల్లా క్రీడా సాధికారిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'అస్మిత అథ్లెటిక్స్' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజ గమనంలో మహిళల కృషి అమూల్యమని, అన్ని రంగాల్లోనూ మహిళలు తమ సత్తా చాటుతున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ 'ఖేలో ఇండియా' చొరవలో భాగంగా దేశవ్యాప్తంగా మహిళల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఈ అథ్లెటిక్స్ లీగ్ నిర్వహిస్తున్నట్లు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్ వివరించారు. ఈ పోటీల్లో సుమారు 256 మంది బాలికలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 100, 200, 400 మీటర్ల పరుగు పందాలతో పాటు టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడలను నిర్వహించారు. మహిళల ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై అవగాహన కల్పించడమే ఈ లీగ్ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. సెట్‌శ్రీ సీఈఓ వి.వి. అప్పలనాయుడు మాట్లాడుతూ.. కుటుంబంలో ప్రేమానురాగాలను పంచుతూనే, సమాజ బాధ్యతల్లోనూ స్త్రీ మూర్తులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచి, అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రతిభను వెలికితీయడమే తమ లక్ష్యమని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎ. మహేష్ బాబు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల క్రీడాకారిణులను ప్రోత్సహించేందుకు ఇటువంటి వేదికలు ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా మెడల్స్, మెరిట్ సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఉరిటి సాయికుమార్, కోచ్‌లు, మేరా యువ భారత్ గణంకాధికారి డి. శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో క్రీడాకారిణులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఎచ్చెర్ల, మహి న్యూస్, మార్చి 8: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తూ, తమదైన ముద్ర వేస్తున్నారని విశాఖపట్నం వినియోగదారుల ఫోరం సభ్యురాలు రహిమునిసియా బేగం అన్నారు. ఆదివారం ఎచ్చెర్లలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రహిమునిసియా బేగం మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో మహిళలకు అత్యున్నత గౌరవం ఉందని పేర్కొన్నారు. నేటి సమాజంలో ప్రతి సవాలును స్వీకరిస్తూ మహిళలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నారని కొనియాడారు. క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధన బాలాజీ మాట్లాడుతూ.. స్త్రీలు ఎక్కడ పూజించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని ఆర్యోక్తి అని గుర్తుచేశారు. ప్రతి పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ శక్తి దాగి ఉంటుందని, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ బాలాజీ, పరిపాలనాధికారి డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, గర్ల్స్ వెల్ఫేర్ డీన్ లక్ష్మీబాల, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, క్యాంపస్-2 ఇన్-ఛార్జ్ సాగర్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిఠాపురం తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా వ్యవహారం

### - వాస్తవాలు వెల్లడించిన ఆర్డీవో మల్లిబాబు




పిఠాపురం, మహి న్యూస్, మార్చి 8: పిఠాపురం తాసిల్దార్ కార్యాలయం వద్ద శ్రీమతి పొట్నూరు దుర్గమ్మ, ఆమె కుమారుడు దాలిపర్తి సత్యనాయక్ తాసిల్దార్ సకాలంలో కుల ధృవీకరణ పత్రం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ ధర్నా నిర్వహించిన ఘటనపై కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) ఎస్. మల్లిబాబు స్పందించారు. నిన్న సాయంత్రం ప్రముఖ టీవీ ఛానల్స్ మరియు సోషల్ మీడియాలో ఈ విషయంపై వచ్చిన వార్తల నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించినట్లు తెలిపారు. సమాచారం అందిన వెంటనే రెవెన్యూ అధికారులు ఘటనపై దృష్టి సారించి సంబంధిత రికార్డులను పరిశీలించారని చెప్పారు. పరిశీలనలో భాగంగా దాలిపర్తి సత్యనాయక్ గతంలో 23 అక్టోబర్ 2021న అప్పటి తాసిల్దార్ కార్యాలయం నుంచి బీసీ -- కుమ్మరి కులానికి చెందిన కుల ధృవీకరణ పత్రాన్ని పొందినట్లు రికార్డుల్లో ఉన్నట్లు వెల్లడించారు. అదే సర్టిఫికెట్‌ను ఆధారంగా చేసుకుని ఆయన పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ చదివినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం మళ్లీ ఎస్సీ రిజర్వేషన్ పొందేందుకు ఈ నెల 6వ తేదీన ఈ-సేవ ద్వారా దరఖాస్తు చేసినట్లు గుర్తించామని చెప్పారు. దరఖాస్తు చేసిన వెంటనే 24 గంటల్లో కుల ధృవీకరణ పత్రం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగడం సమంజసం కాదన్నారు. దరఖాస్తుదారు తల్లి శ్రీమతి పొట్నూరు దుర్గమ్మ ఎస్సీ కులానికి చెందినవారని, తండ్రి బీసీ -- కుమ్మరి కులానికి చెందినవారని పేర్కొన్నారు. ఇంటర్‌కాస్ట్ మ్యారేజ్‌కు సంబంధించిన సర్టిఫికెట్ వంటి అంశాలను పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఒక రోజులోనే పూర్తి స్థాయి పరిశీలన చేసి సర్టిఫికెట్ ఇవ్వడం సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టినట్లు ఆర్డీవో తెలిపారు. గతంలో పొందిన కుల ధృవీకరణ పత్రం, ప్రస్తుత దరఖాస్తు వివరాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించిన తరువాతే తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. అసత్య ఆరోపణలు చేస్తూ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించడం సరైంది కాదని, ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకోవాలని ఆర్డీవో ఎస్. మల్లిబాబు సూచించారు.

## ఎమ్మెల్యే ఆఫీసులో ఘనంగా మహిళాదినోత్సవం



యానాం, మహి న్యూస్, మార్చి. 8.: శాసనసభ్యుడు గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీకేక్కు కట్చేసి మహిళలకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలనుంచి ఈ కార్యక్రమానికి వచ్చిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ అభిమానులు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లోను అభివృద్ధి చెందాలని మహిళాసాధికారిత, లింగసమానత్వం, విద్యకు ప్రాధాన్యత నివ్వడం చేయాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో మహిళలకు మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు..



## ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో 29వ శ్రీవేంకటేశ్వర వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సు ప్రారంభం



తిరుమల,మహి న్యూస్, మార్చి 8: తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో 29వ శ్రీవేంకటేశ్వర వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సు ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సు 13వ తేది వరకు ఆరు రోజుల పాటు పండితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. శ్రీవారి దివ్యానుగ్రహంతో భారతదేశ వ్యాప్తంగా ఉన్న వేద, శాస్త్ర, ఆగమ, స్మార్త, ప్రబంధ పండితులను గుర్తించి, వారిని టీటీడీ పక్షాన పరీక్షించి, నగదు, శాలువా, విజయ పత్రికను అందించి గౌరవించేందుకుగాను 1969 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర వేద, శాస్త్ర, ఆగమ, విద్వత్ సదస్సును ప్రారంభించడం జరిగింది. 2020 వరకు 28 పర్యాయాలు జయప్రదంగా జరుపబడింది. నాటి నుండి నేటి వరకు వివిధ వైదిక విద్యలలో సుమారు నాలుగు వేల మంది పరీక్షలనిచ్చి ఈ సదస్సులో ఉత్తీర్ణులయ్యారు. ఈసారి సదస్సుకు దేశవ్యాప్తంగా 800 మందికి పైగా అభ్యర్థులు సదస్సుకు హాజరవుతున్నారు. వారిని పరీక్షించుటకు 100 మందికి పైగా సుప్రసిద్ధ పండితులు పరిక్షాధికారులుగా అభ్యర్థులను పరీక్షించనున్నారు. ఈ కార్యక్రమ ప్రారంభ సభలో తిరుమల చిన్న జీయర్ స్వామి, మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థ స్వామీజీలు హాజరై అభ్యర్థులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యలయం ఉప కులపతి ఆచార్య జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉప కులపతి రాణి సదాశివమూర్తి, ఇతర పండితులు పాల్గొన్నారు.



## టీటీడీకి రూ.70 లక్షలు విరాళం



తిరుమల, మహి న్యూస్, మార్చి 8: విశాఖపట్నంకు చెందిన ఎన్ఆర్ఐలు త్రిపురనేని వెంకటరత్నం మాధురి దంపతులు ఆదివారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళంగా అందించారు. అదేవిధంగా ఆయన కుమారులు త్రిపురనేని విజయ్, త్రిపురనేని వినయ్ లు కూడా శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు చెరో రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతల ప్రతినిధి పొట్లూరి నరసింహారావు తిరుమలలోని అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాటప్పగారి పల్లి పంచాయతీ నూతన కమిటీ అధ్యక్షులుగా పి. రెడ్డి వరప్రసాద్



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం మార్చి 8. మహి న్యూస్, : చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజకవర్గం, బంగారుపాళ్యం మండలం, కాటప్పగారి పల్లి పంచాయతీకి చెందిన పి.రెడ్డి వరప్రసాద్ (ఎగువ ఎద్దుల వారిపల్లి) వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ కమిటీ నందు గ్రామ కమిటీలో అందరి సమక్షంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని మాజీ సర్పంచ్ పాల్యం చిరంజీవి తెలియచేశారు. ఎన్నికైన సందర్భంగా, పూతలపట్టు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్, పాల ఏకరి రాష్ట్ర సంఘ అధ్యక్షులు ఎంబి కుమార్ రాజా లను కలసి వీరందరికీ శాలువాలతో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రెడ్డి వరప్రసాద్ మాట్లాడుతూ, తనకు వచ్చిన ఈ సదా అవకాశాన్ని వైఎస్ఆర్సిపి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తానని, పంచాయతీ ప్రజలను కలుపుకొని ప్రతి ఒక్క కార్యకర్త కొరకు అహర్నిశలు పనిచేస్తానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుల వారిలో యూత్ అధ్యక్షులుగా ఇ.బాలాజీ (ఎద్దుల వారి పల్లి ) ఎస్సీ విభాగ అధ్యక్షులుగా పి గంగాధరం. (ఎద్దుల వారి పల్లి ) రైతు విభాగం అధ్యక్షులుగా ఇ.విజయ్ కుమార్ (ఎద్దుల వారి పల్లి) మహిళ విభాగం అధ్యక్షురాలిగా టి. భువనేశ్వరి (దిగువ ఎద్దుల వారి పల్లి) సోషల్ మీడియా అధ్యక్షులుగా జి. మోహన్ బాబు (ఎగువ ఎద్దుల వారి పల్లి) వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరిని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, రాష్ట్ర పాలయకరి సంఘ అధ్యక్షులు ఎంబి కుమార్ రాజా అభినందిస్తూ రాబోవు రోజుల్లో వైయస్సార్ సిపి పార్టీ కోసం శాయశక్తుల కృషి చేస్తూ పంచాయతీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్క కార్యకర్తని కలుపుకొని వైయస్సార్సీపి పార్టీ విజయం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. త్వరలో బంగారుపాలెం వైఎస్ఆర్సిపి పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, మండల ఎంపీపీ వైస్ ఎంపీపీ లను, త్వరలో కలవనున్నట్లు రెడ్డివరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్, రాష్ట్ర పాలయకరి సంఘ అధ్యక్షులు ఎంబి కుమార్ రాజా కాటప్పగారి పల్లి పంచాయతీ నుండి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు యువత పాల్గొన్నారు.



## నాగయ్య కళాక్షేత్రం నందు ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు

చిత్తూరు, మహి న్యూస్, మార్చి 8 : ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్,జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు నగర మేయర్ అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు మొదలియా కార్పొరేషన్ చైర్మన్ త్యాగ రాజన్. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నుపురస్కరించు కొని చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం నందు ఐ సి డి ఎస్,డి ఆర్ డి ఎ,మెప్మా, జిల్లా సమాఖ్య ఆధ్వర్యం లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా మహిళా సాధికారత కు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన మహిళలు వారు ఆర్థికంగా అభివృద్ధి లోకి వచ్చిన విధానం ను సభ లో పలువురు మహిళలు వివరించారు... ఈ కార్యక్రమం లో జడ్పీ మహిళా సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్ భారతి, డి ఆర్ డి ఎ,ఐసిడిఎస్,మెప్మా పిడి లు శ్రీదేవి, వేంకటేశ్వరి,రవీంద్ర ,డిఎల్ఎస్ఏ సెక్రెటరీ ఎమ్.ఎస్. భారతి,పోక్సో చట్టం సంబంధించిన లాయర్ శ్రీమతి మోహన్ కుమారి, డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ జి నిర్మల, టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముఖ రెడ్డి, స్టేట్ వుమన్ ప్రెసిడెంట్ వైవి రాజేశ్వరి, పెనుమూరు మండల మహిళ ఎంటర్ప్రెన్నర్ అరుణ, విజయ్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ప్రతినిధి ఎం శైలజ మూర్తి, సంబంధిత శాఖల అధికారులు,పెద్ద ఎత్తున స్వయం సహాయక సంఘాల పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమమే ధ్యేయం.. కూటమి ప్రభుత్వంలోనే మహిళలకు రక్షణ

## - చంద్రగిరి ఎమ్మెల్యే

చంద్రగిరి ,మహి న్యూస్, మార్చి 8 : ఆడబిడ్డల చిరునవ్వులోనే రాష్ట్ర అభివృద్ధి దాగి ఉందని, గత ఐదేళ్ల అరాచక పాలనలో మహిళలకు కరువైన గౌరవాన్ని, భద్రతను పునరుద్ధరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఉద్ఘాటించారు. ఆదివారం చంద్రగిరిలోని ఒక ప్రైవేట్ కళ్యాణ మండపంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన తన సతీమణి పులివర్తి సుధారెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు మంజూరైన సుమారు 520 కోట్ల రూపాయల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. సభా ప్రాంగణంలో




మహిళా వ్యాపారవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పులివర్తి సుధారెడ్డి పరిశీలించి, వారిని ప్రోత్సహిస్తూ కొన్ని వస్తువులను కొనుగోలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి మహిళా సంక్షేమ పథకాలను ప్రారంభించడం సాధికారతకు నిదర్శనమన్నారు. భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా తండ్రి ఆస్తిలో ఆడబిడ్డలకు సమాన హక్కు కల్పించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావుకే దక్కుతుందని గుర్తు





చేశారు. ఆడబిడ్డల ఉన్నత విద్య కోసం 'ఎన్టీఆర్ విద్యాలక్ష్మి', వివాహ సహాయం కోసం 'ఎన్టీఆర్ కళ్యాణ లక్ష్మి' పథకాల ద్వారా లక్ష రూపాయల వరకు పావలా వడ్డీకే రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. అలాగే తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని స్పష్టం చేశారు. మహిళా నాయకురాలు పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రపతి స్థాయి నుండి అంతరిక్షం వరకు మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నారని కొనియాడారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో జ్యూట్ బ్యాగుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, బ్యూటీ పార్లర్ వంటి రంగాల్లో డ్వాక్రా మహిళలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఓఎన్డీసీ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి వారికి ఆదాయం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా పెద్ద సంఖ్యలో మహిళలు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం శుభపరిణామన్నారు. పురుషులకు ఉద్యోగ రీత్యా పదవీ విరమణ ఉంటుంది కానీ, మహిళలకు కుటుంబ బాధ్యతల నుండి విరామం ఉండదని పులివర్తి నాని పేర్కొన్నారు. కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ మహిళలు చేసే త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా మహిళలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కూటమి నాయకులు మరియు మహిళా కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాలలో బాల్య వివాహాలు జరగకుండా చూడవలసిన బాధ్యత పొదుపు మహిళా సంఘాల పై ఉన్నది

## మహిళలు మనోధైర్యంతో బతకాలి... కనికరంతో కాదు

చిత్తూరు, మహి న్యూస్, మార్చి 8: కోస్తా జిల్లాల కంటే రాయలసీమ జిల్లాలో స్త్రీల జనాభా తక్కువగా ఉన్నది అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం నందు ఐ సి డి ఎస్ డి ఆర్ డి ఏ, మెప్మా ,జిల్లా మహిళా సమాఖ్య సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, చిత్తూరు నగర మేయర్ అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు మొదలియా కార్పొరేషన్ చైర్మన్ త్యాగ రాజన్. తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూసమాజ వికాసానికి సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు.చారిత్రకంగా రాయలసీమ ప్రాంతంలో (చిత్తూరు,



అన్నమయ్య, కడప, నెల్లూరు, తిరుపతి జిల్లాలు) పురుషులతో పోలిస్తే మహిళల సంఖ్య తక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆడ శిశువుల జనన రేటు తగ్గడానికి భ్రూణ హత్యలు ఒక ప్రధాన కారణమని, దీనిపై సమాజంలో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో జరుగుతున్న వివాహాలలో సుమారు 12 నుండి 15 శాతం వరకు బాల్య వివాహాలే జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం జిల్లాలో సుమారు 25 వేల కాన్పులు జరుగుతుండగా, అందులో దాదాపు 10 శాతం అంటే సుమారు 2,500 కేసులు 18 సంవత్సరాల లోపు బాలికలకే సంబంధించినవని వివరించారు. టీనేజ్ వయసులో గర్భధారణలు బాలికల ఆరోగ్యం సమస్యలు తలెత్తుతాయని మరియు భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలు అయిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పురుషులతో పోలిస్తే మహిళల



సంఖ్య మెరుగ్గా ఉందని, అదే విధమైన మార్పు రాయలసీమ ప్రాంతంలో కూడా రావాలని ఆకాంక్షించారు. స్వయం సహాయక సంఘాలు , ఐసీడీఎస్, మెప్మా , డీఆర్డీఏ వంటి సంస్థల ప్రతినిధులు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో మహిళలకు సంబంధించిన సమస్యలపై చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం చిత్తూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సేవలు, త్యాగం మరియు సమాజ నిర్మాణంలో వారి పాత్రను ప్రశంసించారు. చిత్తూరు మేయర్ అముదమ్మ ప్రజాసేవలో నిమగ్నమై పనిచేస్తున్న స్ఫూర్తిదాయక మహిళగా అభినందించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ హేమలత తన భర్త హతాన్మరణం అనంతరం కూడా కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ మహిళల కోసం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. తన వ్యక్తిగత జీవితంలో మహిళల పాత్రను ప్రస్తావిస్తూ, చిన్ననాటి నుంచి తన తల్లి చూపిన ధైర్యం మరియు సహకారం తనను ఈ స్థాయికి తీసుకువచ్చిందని తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళలు చూపిన మద్దతును కూడా ఆయన గుర్తుచేశారు. అనంతరం పూతల పట్టు శాసనసభ్యులు కె.మురళీమోహన్ మాట్లాడుతూ... మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలను తెలిపారు. ఈ ప్రపంచం యావత్తూ మహిళల మీద ఆధారపడి, మహిళల చేత నిర్మించబడి, మహిళల వలన అభివృద్ధి చెందుతుందని, ప్రతి కుటుంబంలో మహిళ ప్రత్యేక పాత్ర పోషిస్తుందనన్నారు. ఇంటి ప్రగతి, అభివృద్ధి, సంక్షేమం వంటివి మహిళల పైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. మహిళలు మనోధైర్యంతో బతకాలని కనికరంతో కాదని, ఆనాడు గౌరవ స్వర్గీయ నందమూరి తారక రామారావు మహిళలకు పురుషులతో పాటు సమానంగా ఆస్తి హక్కు కల్పించారనన్నారు. మన రాష్ట్రంలో మహిళల ప్రగతికి మార్పు ప్రథమంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు తో మొదలైందని, మహిళా దినోత్సవం రోజే కాకుండా ప్రతిరోజు మహిళలు గౌరవింపబడాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నారని,మహిళల అభివృద్ధికి కృషి చేసే నాయకుడు మన ముఖ్యమంత్రి అన్నారు. నగర మేయర్ మాట్లాడుతూ పూర్వం మహిళలు కొంతవరకు చదువుకొని ఇంట్లో ఉంటే చాలనే రోజుల నుంచి ప్రస్తుతం అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అభివృద్ధిలో ముందున్నారని, మహిళలు చదువులో రాణించాలని, బాగా చదువుకోవడం వల్ల ఏ రంగంలో అయినా ముందు అడుగులో ఉంటారని విన్నవించారు. చుడా చైర్మన్ కటారి హేమలత మాట్లాడుతూ... ప్రతి స్త్రీ మనకు మనం గౌరవించుకుంటూ ప్రతి పనిని సంకల్పంతో చేయడం వల్ల ముందంజలో ఉంటామని, మహిళలంటే బహుగుణ ప్రతిభ కలిగినవారని, ఎటువంటి విషయం అయినా పలు కోణాలలో ఆలోచించి సమస్యలను పరిష్కరించ గలుగుతారని, మహిళలకు విద్య, ఉద్యోగం, భద్రత కల్పించడం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధ్యేయమని, రాబోయే రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉంటారని, ప్రతి ప్రతి పురుషుడికి మహిళ ఒక తల్లిగా, ఒక చెల్లిగా, ఒక భార్యగా, ఒక అక్కగా ప్రత్యేక స్థానంలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా మహిళా సాధికారత కు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన మహిళలు వారు ఆర్థికంగా అభివృద్ధి లోకి వచ్చిన విధానం ను సభ లో పలువురు మహిళలు వివరించారు... కార్యక్రమంలో భాగంగా డి ఆర్ డి ఏ ద్వారా 205 మహిళలకు పీఎం- అజయ్ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ 2,94,50,000 లు మెగా చెక్కును జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా మహిళలకు అందజేశారు. యాదమరి మండలం ,మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు రజియా ఎనిమిది లక్షల రూపాయలు విలువ చేసే ట్రాక్టర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అమరావతి పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పై కార్యక్రమాలను లైవ్ టెలికాస్ట్ ద్వారా సబికులు ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ, మెప్మా,ఐసీడీఎస్ అధికారులను, అంగన్వాడి సూపర్వైజర్లు, వర్కర్లను, ఉత్తమ ఎంట్రపెన్యూర్లకు వేదికపై జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమం లో జడ్పీ మహిళా సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్ భారతి, డి ఆర్ డి ఎ,ఐసిడిఎస్,మెప్మా పిడి లు శ్రీదేవి, వేంకటేశ్వరి,రవీంద్ర ,డీఎల్ఎస్ఏ సెక్రెటరీ ఎమ్.ఎస్. భారతి, పోక్సో చట్టం సంబంధించిన లాయర్ శ్రీమతి మోహన్ కుమారి, డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ జి నిర్మల, టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముఖ రెడ్డి, స్టేట్ వుమన్ ప్రెసిడెంట్ వైవి రాజేశ్వరి, పెనుమూరు మండల మహిళ ఎంటర్ప్రెన్నర్ అరుణ, విజయ్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ప్రతినిధి ఎం శైలజ మూర్తి, సంబంధిత శాఖల అధికారులు,పెద్ద ఎత్తున స్వయం సహాయక సంఘాల పాల్గొన్నారు.

## మార్చి నెల 9 వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

**చిత్తూరు, మహి న్యూస్, మార్చి 8: మార్చి నెల 9 వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఉదయ 9.3.2026 వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల,డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ అన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవఎశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు కూడా వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.**

## శ్రీ కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న


### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, మహి న్యూస్, మార్చి 8: కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామ స్వామి ఆలయం ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, నిర్వహించారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధతో నిర్మించిన ఈ ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక శాంతిని, సౌఖ్యాన్ని ప్రసాదించే ప్రధాన కేంద్రంగా నిలవాలి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ శివ రామ దేవాలయంలో ప్రత్యేక పూజలు

### కార్యక్రమం లో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే శ్రీ బొగ్గుల దస్తగిరి






కర్నూలు ప్రతినిధి మహిన్యూస్ మార్చి 08: కర్నూలు మండలం పసుపల గ్రామం లోనీ శ్రీ శ్రీ శ్రీ శివ రామ దేవాలయశీ లో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయ అభివృద్ధి, ప్రాంత ప్రజల సుఖశాంతులు కోసం ప్రార్థనలు చేశారు. అలాగే ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే ని సన్మానించి ఆశీర్వాదాలు అందజేశారు.

# కర్నూల్ లో ఘనంగా కీర్తి మెడికల్ స్టోర్ ప్రారంభించిన ఎంపీ నాగరాజు




కర్నూలు ప్రతినిధి మహిన్యూస్ మార్చి 08: కర్నూలు నగరంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ఎదురుగా బుధవార పేట మెయిన్ రోడ్ లో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు,చేతుల మీదుగా గొప్పగా ఘనంగా ప్రారంభించారు. మన కర్నూల్ జిల్లాలోని ఇంత పెద్ద మెడికల్




స్టోర్ ను అందించిన ఎండి తిరుపతిరెడ్డి, మేనేజర్ రాజశేఖర్ రెడ్డి, ఏబీఎం బిజీ గోపికృష్ణ,సిఆర్ఎం డాక్టర్ జి సుష్మ కు నగర ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ కర్నూలులో ఇప్పటివరకు ఇంత పెద్ద మెడికల్ స్టోర్ ఎక్కడ లేదన్నారు. కీర్తి మెడికల్ స్టోర్ ప్రైవేట్ లిమిటెడ్ నందు మెడిసిన్స్, బేబీ కేర్, సర్జికల్స్ లభించును. బెంగళూరు, హైదరాబాద్,కర్నూల్, విజయవాడ వంటి పట్టణాలలో ప్రముఖ హాస్పిటల్ నందు అన్ని రకముల వ్యాధులకు డాక్టర్లు సూచించే క్వాలిటీ మందులు అందుబాటు ధరలలో బిల్లుతో లభించునన్నారు. కర్నూలు నగరంలో ఈ మెడికల్ షాపు రావడం నాకు ఎంత సంతోషం ఉందని ఆయన అన్నారు. అదేవిధంగా కీర్తి మెడికల్ షాపు ఆదోని ప్రాంతంలో పెట్టాలని ఆయన సూచించాడు. అంతేకాకుండా మొట్టమొదటిసారిగా కర్నూలులో మెడిసిన్స్ హోమ్ డెలివరీ సౌకర్యం కలదన్నారు. మన మెడికల్ స్టోర్ లో బేబీ కేర్ ప్రాడక్ట్స్ పై పది 10శాతం మెడిసిన్స్ పై 20 శాతం, సర్జికల్స్ పై 25 శాతం డిస్కౌంట్ కలదు. కావున నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుచున్నాము. కార్యక్రమంలో కస్టమర్స్ వేలాది సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ నెల 9వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### అర్జీలు “meekosam.ap.gov.in” లో నమోదు చేసుకోవచ్చు



నంద్యాల, మహి న్యూస్, మార్చి 08 :- ఈ నెల 09వ తేదీన (సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్లైన్‌లో meekosam.ap.gov.in ద్వారా కూడా సమర్పించవచ్చున్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

# మార్చి 9వ తేదీ ( సోమవారం) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం

కర్నూలు, మహి న్యూస్, మార్చి 8: ఈ నెల 9 వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

### అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# న్యాయ సేవా సదన్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




కర్నూలు, మహి న్యూస్, మార్చి 8 : జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు అధ్యక్షులు జి. కబర్ధి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూల్ నగరంలోని స్థానిక జిల్లా కోర్ట్ ఆవరణలో గల న్యాయ సేవా సదన్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి. కమలాదేవి , ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మి రాజ్యం ,సి బి ఐ కోర్ట్ జడ్జి శోభారాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ , మొబైల్ కోర్ట్ జడ్జి అనూష పాల్గొన్నారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మొదటి అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ మహిళా దినోత్సవం విశిష్టత, మహిళల యొక్క ప్రాముఖ్యతను వివరించారు, అలాగే మహిళలు నేటి సమాజంలో జరుగుతున్న అరాచకాలు దృష్టిలో ఉంచుకొని ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని, అలాగే మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తే దేశం ఎంతగానో పురోగతి సాధిస్తుందని అన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మరియు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి సూచనల మేరకు



వందరోజుల బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మరియు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారి సంయుక్త సహకారంతో జిల్లాలోని 160 గ్రామాలలో సదస్సు లు నిర్వహించి బాల్య వివాహల వల్ల జరిగే అనర్థాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. బి.అగ్రహారం, సంతె కుడ్లూరు, లింగంపల్లి గ్రామాలలో జరుగుతున్న బాల్య వివాహాలను సకాలంలో ఆపి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం మహిళా న్యాయ మూర్తు లైన కమలాదేవి ,లక్ష్మి రాజ్యం, శోభారాణి,సరోజనమ్మ, అనూష లను లీగల్ సర్వీసెస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయ వాదులు నిర్మల, యూ వి లక్ష్మి, ఇందుమతి మరియు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సులోచన, బచ్పన్ బచావో ఆందోళన్ ఎన్జీవో మౌనిక, ఎన్జీవో డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు ,మహిళా ప్యానెల్ నాయవాదులు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు అన్ని కోర్టు ల మహిళ సిబ్బంది, ప్యారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి - మంత్రి ఎన్ఎండి ఫరూక్




నంద్యాల, మహి న్యూస్, మార్చి 08:- మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావడమే సమాజ పురోగతికి పునాది అని జిల్లా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని మునిసిపల్ టౌన్ హాలులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. విద్య లేనివాడు ప్రపంచంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేడని, ప్రతి కుటుంబం పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధి ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల చదువును ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతిలో చాలా మంది మహిళలే ఉన్నారని ఆయన తెలిపారు. వివాహం అయిన తర్వాత కూడా పిల్లలను చూసుకుంటూ చదువు కొనసాగిస్తూ పరీక్షలకు హాజరవుతున్న మహిళల పట్టుదల అభినందనీయం అన్నారు. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన డీఎస్సీ పరీక్షలను మళ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ ప్రారంభం కావడం వల్ల యువతకు మంచి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలకు హాజరైన అభ్యర్థుల్లో మహిళలు అధిక శాతం ఉండటం మహిళల చైతన్యాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో జనన రేటు తగ్గిపోతున్న నేపథ్యంలో మానవ వనరుల అభివృద్ధి ఎంతో కీలకమని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. యువత సంఖ్య పెరిగితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, సమతుల్య జనాభా దేశ అభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా వేల కోట్ల రూపాయల సహాయాన్ని అందిస్తోందని ఆయన తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను నిలబెట్టడమే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఒక ముస్లిం మహిళ తన కృషితో సంవత్సరానికి దాదాపు రూ.36 లక్షల ఆదాయం సంపాదిస్తూ వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉదాహరణను మంత్రి ప్రస్తావించారు. ఇలాంటి మహిళలు సమాజానికి ప్రేరణగా నిలుస్తారని, వారిని ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆడపిల్లల వివాహాల కోసం ‘షాదీ ముబారక్’ వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి వివరించారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం నిర్మాణ రంగం సహా అనేక ఉపాధి రంగాల్లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒక ఇంటి నిర్మాణంలోనే అనేక రకాల పనులు ఉంటాయని, వాటిని నేర్చుకుంటే స్థానిక యువతకు మంచి ఆదాయం లభిస్తుందని సూచించారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

### మహిళల పురోగతే నిజమైన అభివృద్ధి - రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని మహిళలందరికీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించిన చారిత్రక నిర్ణయం తీసుకున్న నాయకుడు ఎన్టీఆర్ అని ఆయన గుర్తు చేశారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం కార్యక్రమం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల ద్వారా మహిళలకు ఉపశమనం కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే మహిళలు వ్యవసాయం, వ్యాపారం, స్వయం ఉపాధి వంటి అనేక రంగాల్లో పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఎంటర్ప్రెన్యూర్లుగా ఎదుగుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు తమలోని ప్రతిభను వెలికి తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. అంతకుముందు మంత్రులు స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి లీలావతి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ వెంకట దాసు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## ప్రాంగణం, హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, మహి న్యూస్, మార్చి 08:- డోన్ మండలం కొత్త బురుజు గ్రామంలో ఈ నెల 9వ తేదీన జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా ఆదివారం క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. పర్యటన సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమం విజయవంతంగా జరిగేలా చేపడుతున్న ఏర్పాట్లను ఆమె వివిధ కోణాల్లో సమీక్షిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు.

### సభా ప్రాంగణం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

కార్యక్రమం నిర్వహించనున్న సభా ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి విస్తీర్ణం, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ, నీడ కోసం షెడ్లు ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యే రైతులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### హెలిప్యాడ్ పనుల పరిశీలన

ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగేందుకు ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా హెలిప్యాడ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. హెలిప్యాడ్ వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు ఫైర్ సేఫ్టీ చర్యలు, అత్యవసర పరిస్థితులకు అంబులెన్స్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

### రవాణా, ట్రాఫిక్ నిర్వహణపై సూచనలు

కార్యక్రమం జరిగే ప్రదేశానికి చేరుకునే రహదారులను మరమ్మతులు చేసి రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ముందస్తు ప్రణాళిక రూపొందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

కార్యక్రమానికి విచ్చేసే ప్రజలకు తాగునీరు, పార్కింగ్ స్థలాలు, శానిటేషన్ సదుపాయాలు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### రైతులతో ఆత్మీయంగా ముచ్చటించిన కలెక్టర్

ఈ సందర్భంగా రైతులతో జిల్లా కలెక్టర్ ఆత్మీయంగా ముచ్చటించి వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఉన్నతాధికారుల సమీక్ష

ఈ పరిశీలనలో రాష్ట్ర భూసర్వే మరియు భూవ్యవస్థాపన శాఖ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ మరియు స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీమతి జి. జయలక్ష్మి, అదనపు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ శ్రీ జె. వెంకట మురళి పాల్గొని కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు చేపడుతున్న చర్యలపై వివరాలు తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.

### సమన్వయంతో పని చేయాలి

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే సమగ్రంగా ప్రణాళిక రూపొందించి ఎలాంటి లోపాలు లేకుండా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను కచ్చితంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట స్థానిక ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, పోలీసు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణకు వన్ స్టాప్ సెంటర్ సేవలు బాధిత మహిళలకు ఒకే చోట అన్ని సహాయాలు

## ఆదోని లో వన్ స్టాప్ సెంటర్ ప్రారంభం.

కర్నూలు, మహి న్యూస్, మార్చి 08: ఆదోని పరిసర ప్రాంతాల్లో మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలకు గురైన బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు వన్ స్టాప్ సెంటర్ ద్వారా సమగ్ర సేవలు అందించబడుతున్నాయి. కుటుంబంలో, సమాజంలో, కార్యాలయాల్లో లేదా ఇతర ప్రజా మరియు వ్యక్తిగత ప్రదేశాల్లో హింసకు గురైన మహిళలకు ఒకే చోట అవసరమైన సహాయం అందించడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశం అని ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆదోని ప్రభుత్వం జనరల్ హాస్పిటల్ లో శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి అనంతరం అధికారులతో కలసి మహిళలకు అత్యవసర సహాయం అందించే ఉమెన్ హెల్ప్ లైన్ -- 181 మరియు పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చైల్డ్ హెల్ప్ లైన్ -- 1098 సేవలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ...వన్ స్టాప్ సెంటర్ ద్వారా మహిళలపై జరిగే అన్ని రకాల హింసకు వ్యతిరేకంగా పోరాడేందుకు తక్షణ, అత్యవసర మరియు ఇతర అవసరమైన సేవలు అందుబాటులో ఉంచబడతాయని తెలిపారు . ఈ కేంద్రం ద్వారా అత్యవసర స్పందన మరియు రక్షణ సేవలు, వైద్య సహాయం, మహిళలు ఎఫ్ఐఆర్/ ఎన్సీఆర్ / డిఐఆర్ నమోదు చేయడంలో సహాయం, మానసిక-సామాజిక కౌన్సెలింగ్, న్యాయ సహాయం, అవసరమైన వారికి ఆశ్రయం, అలాగే వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యం వంటి సేవలు అందించబడుతున్నాయి. వన్ స్టాప్ సెంటర్ సేవలు 18 సంవత్సరాల లోపు బాలికలు సహా అన్ని మహిళలకు అందుబాటులో ఉంటాయి. కులం, మతం, వర్గం,






ప్రాంతం, లైంగిక అభిరుచి లేదా వివాహ స్థితి వంటి భేదాలు లేకుండా హింసకు గురైన మహిళలు ఈ సేవలను పొందవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ.. మాట్లాడుతూ, కర్నూలు జిల్లాలో రెండవ వన్ స్టాప్ సెంటర్ ను ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే మొదటి వన్ స్టాప్ సెంటర్ కర్నూలులో పనిచేస్తున్నదని పేర్కొన్నారు. ఈ సెంటర్ యొక్క ప్రధాన ఉద్దేశ్యం 0 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల హింసకు గురైన మహిళలకు పునరావాసం, న్యాయ సహాయం, వైద్య సేవలు, పోలీసు సహాయం వంటి అన్ని అవసరమైన సేవలను ఒకే చోట అందించడం అని వివరించారు. బాధిత మహిళలకు తక్షణ సహాయం అందించి వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం కల్పించే విధంగా ఈ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. ఈ సదుపాయాలపై సమాజంలో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే హింసకు గురైన మహిళలు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని, పిల్లలకు సంబంధించిన సమస్యల కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కు సంప్రదిస్తే సంబంధిత సిబ్బంది వారి వద్దకు చేరుకుని అవసరమైన వైద్య మరియు ఇతర సహాయ సేవలు అందిస్తారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 10 వన్ స్టాప్ కేంద్రాలను ప్రారంభించారు. అందులో కర్నూలు జిల్లా ఆదోని లో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ కూడా ఒకటిగా ప్రారంభించబడింది. ఈ సందర్భంగా మహిళల సాధికారత, సంక్షేమం మరియు భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఇచ్చిన సందేశాన్ని ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) వారి ఆధ్వర్యంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు అత్యవసర సహాయం, న్యాయ సహాయం, వైద్య సేవలు, కౌన్సెలింగ్ వంటి సేవలను ఒకే కేంద్రం ద్వారా అందించడమే వన్ స్టాప్ సెంటర్ ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఢిల్లీశ్వరి, హాస్పిటల్స్ సూపర్డెంట్ యం. నాగరాజు శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

